మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNEDAY 11-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 223 Issue: 223

11 ఫిబ్రవరి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:48 సూర్యాస్తమయం - సా. 6:12 తిథి నవమి ఉ. 9:58 వరకు తరువాత దశమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం అనూరాధ ఉ. 10:45 వరకు తరువాత జ్యేష్ఠ యోగం వృఘతా రా. 2:24౦ వరకు కరణం గరజి ఉ. 9:58 వరకు వనిజ రా. 11:11 వరకు వర్జ్యం సా. 5:07 నుండి సా. 6:54 వరకు దుర్ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు రాహుకాలం మ. 12:30 నుండి మ. 1:55 వరకు యమగండం ఉ. 8:13 నుండి ఉ. 9:39 వరకు గుళికాకాలం ఉ. 11:04 నుండి మ. 12:30 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:12 నుండి ఉ. 6:00 వరకు అమృత ఘడియలు తె. 3:50 నుండి తె. 5:38 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున




## జగన్ అసెంబ్లీకి వస్తారు

### వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయని, వైఎస్ జగన్ అసెంబ్లీకి వస్తారని స్పష్టం చేశారు. అదే సమయంలో చంద్రబాబు పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ' రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగాలేవు. ప్రజలు అర్ధాకలితో ఉంటే పట్టించు కోవటం లేదు. రాష్ట్రంలో పాలన గాలికి వదిలేశారు.

## నేను సభకు రాను: ఓం బిర్లా



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై స్పష్టత వచ్చే వచ్చే వరకు లోక్‌సభకు రాకూడదని నిర్ణయం తీసుకున్నారు. మార్చి 9న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనుంది. లోక్‌సభ సమావేశాలు ప్రారంభం నుంచి స్పీకర్ ఓంబిర్లా సభ నిర్వహణలో పక్షపాతం చూపిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై స్పష్టత వచ్చే వచ్చే వరకు లోక్‌సభకు రాకూడదని నిర్ణయం తీసుకున్నారు. మార్చి 9న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనుంది. లోక్‌సభ సమావేశాలు ప్రారంభం నుంచి స్పీకర్ ఓంబిర్లా సభ నిర్వహణలో పక్షపాతం చూపిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సభలో తరువాయి 2 వ పేజీలో...

## నేడే 'పుర' పోలింగ్

### 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు
### పోలింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి
### 8,203 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ భద్రత




హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ భద్రత కల్పించామని, ఇందులో 1,302 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా తరువాయి 2 వ పేజీలో...

## ఒక్కో రైతు నెత్తిన.. ₹74,121 అప్పు

### 5 వ స్థానంలో తెలంగాణ రైతులు

### 50.2 శాతం మంది రైతులకు బాకీలే


69.6 శాతం రుణాలు బ్యాంకుల్లోనే.. 57.5 శాతం అప్పులు ఎవుసం కోసమే

ఏపీ అన్నదాతలపై అత్యధికంగా అప్పు.. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ వెల్లడి

పొలంలో
విత్తిన చెమట..
కాగితాలపై అప్పు
మొలకెత్తని పంట..
పుట్టగొడుగుల్లా వడ్డీలు
మబ్బులు కురవని వాన..
కండ్ల నిండా కన్నీళ్లు
వడ్ల కుప్పలు లేక..
అప్పుల కుప్పలు
నిండిపాయే
తల వంచి భిక్షం..
ముందు
షావుకారి గుమ్మం
మట్టితోనే ఊపిరి..
వదిలే మట్టిలోనే
కొన ఊపిరి

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): దుక్కి దున్నడానికి అప్పు.. విత్తనం వేయడానికి అప్పు.. కలుపు తీసేందుకు అప్పు.. ఎరువుల కోసం అప్పు.. పంట కోసేందుకు అప్పు.. ఇలా దేశానికి వెన్నెముక అని పిలుచుకునే రైతు, నేడు అప్పుల భారంతో కూరుకుపోతున్నాడు. పండించిన పంటకు కనీస మద్దతు ధర అందక, దళారుల బెడద వల్ల రైతులు పైసల లోకంలో పిప్పిలా మారిపోతున్నారు. అకాల వర్షాలు, కరువులు భూతంలా పట్టి పీడిస్తుంటే పాణాలు వదులుతున్నాడు. దేశంలో రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందంటే.. ఒక్కో రైతుపై సగటున అప్పు రూ. 74,121 ఉంది. ఇది కేవలం అధికారిక గణాంకం మాత్రమే. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల - 2 వ పేజీలో...




## 'స్టాంప్' పడాలి!

### నిజమైనదా, ఏఐ సృష్టా అన్నది తెలియాలి

స్పష్టంగా కనిపించేలా లేబుల్ ఉండాలి.. కేంద్రం తాజా నియమ నిబంధనలు జారీ

ఏఐ జనరేటెడ్ కంటెంట్ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. డీప్ ఫేక్ వీడియో, సింథటిక్ ఆడియో, అల్గారిథమిక్‌గా మార్చబడిన విజువల్స్‌తో సహా ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను మొదటిసారిగా నిర్మాణాత్మక నియంత్రణ చట్రం కిందకు తీసుకువచ్చే ఐటీ ఇంటర్మీడియరీ రూల్స్‌కు సవరణలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిం ది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాల జీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) సవరణ నియమాలు, ఫిబ్రవరి 20 నుండి అమల్లోకి రానున్నాయి.

న్యూఢిల్లీ:అప్‌డేటెడ్ ఫ్రేమ్‌వర్క్ కింద, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు , డిజిటల్ ఇంటర్‌మీడియరీస్ సింథటికల్ జనరేటెడ్ ఇన్ఫర్మేషన్ (ఎస్జీఐ) స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా లేబుల్ చేయాలి. దీని ద్వారా వినియోగదారులు ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను నిజమైన కంటెంట్ నుండి వెంటనే గుర్తించగలరని పేర్కొంది. ప్లాట్‌ఫారమ్‌లు ఏఐ జనరేటెడ్ కంటెంట్ సోర్స్‌ను గుర్తించగలిగేలా చేయడానికి నిరంతర మెటాడేటా , ప్రత్యేక ఐడెంటిఫైయర్‌లను కూడా పొందుపరచాలి. ఈ లేబుల్‌లు లేదా మెటాడేటాను ఒకసారి అప్లయ్ చేసిన తర్వాత లేబుల్‌ను గానీ, మెటా డేటాను గానీ తొలగించడానికి లేదా కనబడకుండా చేయడానికి వీల్లేకుండా ఉండాలని తెలిపింది. దీనితో పాటు చట్టవిరుద్ధమైన, అసభ్య, మోసపూరిత ఏఐ కంటెంట్‌ను నిరోధించడానికి తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.15,878 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,078 |

## ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్



### ఏ ఫాంహౌస్‌లోనో ట్యాపింగ్ పరికరాలు

వాటన్నింటినీ ప్రభుత్వం ఆరా తీస్తోంది.. మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక మంది ఫోన్లను ట్యాప్ చేసిందని అన్నారు. అయితే ఇప్పటికీ కూడా వాళ్లు ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ మెటీరియల్... ఏ మామిడి తోటనో, ఫామ్ హౌస్‌లోనో ఉంచి ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ పరికరాలు అమర్చారో ప్రభుత్వం ఆరా తీస్తోం దని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని... బాధ్యులపై చట్ట పరమైన కఠిన చర్యలు తప్పకుండా ఉంటాయని హెచ్చరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం రోజున మీడియాతో మాట్లాడారు. 'బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది వాస్తవం. న్యాయమూర్తులు, -2 వ పేజీలో...



## ఓటర్లకు సంజయ్ ప్రలోభాలు

### జగిత్యాల ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి.. ఈసీకి జీవన్ రెడ్డి లేఖ

జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీమంత్రి జీవన్ రెడ్డి మధ్య ఎడతెగని ఆధిపత్య పోరు.. చివరికి కేంద్ర ఎన్నికల సంఘం గడప తొక్కింది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జగిత్యాల, రాయికల్ ప్రాంతాల్లో మున్సిపల్ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పేర్కొంటూ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి సంజయ్ చేరికను మొదటి నుంచి తరువాయి 2 వ పేజీలో...



## ప్రభుత్వంలో లంచగొండులు

### ప్రభుత్వ పాలనలో భారీ అవినీతి
### ఉద్యోగుల్లో భయం ఉండట్లేదు
### సచివాలయ ఉద్యోగుల వంత
### రిటైర్డ్ ఐఎఫ్ఎస్ పద్మానాభరెడ్డి
### సీఎం రేవంత్ రెడ్డికి ఘాటు లేఖ

ప్రభుత్వ పాలనలో అవినీతి పెరిగిపోయిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చైర్మన్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పద్మనాభరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తప్పు చేస్తే శిక్ష పడుతుందన్న భయం ప్రభుత్వ ఉద్యోగుల్లో ఏ కోశాన లేదని పేర్కొన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): ఏసీబీ, విజిలెన్స్ శాఖలు విచారణ జరిపి ప్రభుత్వానికి పంపిన నివేదికలపై చర్యలు లేవని,. లంచం తీసుకుంటూ పట్టుబడిన లేక ఆశ్రిత పక్షపాతం, బంధు ప్రీతితో ప్రభుత్వానికి నష్టం కలిగించే నిర్ణయాలు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



టెక్సస్‌కు చెందిన ఓ వ్యాపారి.. మానసిక, శారీరక దివ్యాంగురాలైన తన కూతురి బాధను చూడలేక తన 51 మిలియన్ డాలర్ల కంపెనీని అమ్మేసి, శాన్ ఆంటోనియోలో ఒక అమ్యూజ్‌మెంట్ పార్కును కట్టాడు. శారీరక, మనో వైకల్యంతో బాధపడే ఎవరైనా సరే అక్కడికి ఉచితంగా వచ్చి ఎంజాయ్ చేయొచ్చు. వారితో పాటు వచ్చే సహాయకారులకూ ప్రవేశం ఉచితం.

## ఉద్యోగుల ఉసురు పోసుకోకు!

### డీఏలు, పీఆర్సీల సంగతేంది?.. రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, రిటైర్డ్ ఉద్యోగుల డీఏలు, పీఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజ నాలపై.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు.

కరీంనగర్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): ఉద్యోగుల పెండింగ్ డీఏలు, పీఆర్సీలతోపాటు.. రిటైర్మెంట్ ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని మంగళవారం డిమాండ్ చేశారు. తెలంగాణలో 3 లక్షలకు పైగా రెగ్యులర్ ఉద్యోగులతోపాటు.. 4 లక్షలకు పైగా రిటైర్డ్ ఉద్యోగులకు.. మొత్తంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని బండి సంజయ్ తరువాయి 2 వ పేజీలో...



## సచిన్ ఇంట పెళ్లి సంబురాలు!

### ముంబైలో మార్చి 5న అర్జున్ మ్యారేజ్.. ప్రధాని మోదీకి వివాహ శుభలేఖ

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇంట పెళ్లి పనులు ఘనంగా మొదలయ్యాయి. తన కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ సచిన్, ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిశారు.

న్యూఢిల్లీ: మంగళవారం (ఫిబ్రవరి 10) ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో సచిన్ తో పాటు భార్య అంజలి, కుమారుడు అర్జున్, కాబోయే కోడలు సానియా చందోక్ కూడా పాల్గొన్నారు. కేవలం వెడ్డింగ్ కార్డ్ -2 వ పేజీలో...

## రాశి ఫలాలు



11.2.2026

**మేషం:** ఊహించని శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో కొన్ని కీలక విషయాలపై చర్చలు చేస్తారు. నూతన వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయపడతారు.

**వృషభం:** వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. సమాజంలో కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. సంతాన పరమైన ఇబ్బందులు బాధిస్తాయి.

**మిధునం:** కుటుంబంలో గందరగోళ పరిస్థితులుంటాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో కొంత జాప్యం తప్పదు. దీర్ఘకాలిక వివాదాలకు సంబంధించి సన్నిహితుల నుండి ఆసక్తికర సమాచారం అందుతుంది. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో కొంత ఇబ్బందికర వాతావరణం ఉంటుంది.

**కర్కాటకం:** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. గృహమునకు దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. అనుకొన్న పనులు నూతనోత్సాహంతో పూర్తిచేస్తారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

**సింహం:** చేపట్టిన పనుల్లో ఊహించని ఆటంకాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చిన్ననాటి మిత్రులతో వివాదాలు కలుగుతాయి. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. ధార్మిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలు స్థిరత్వం ఉండవు.

**కన్య:** కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా విజయం సాధిస్తారు. గృహమున బంధు మిత్రులతో ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక ఋణ సమస్యలు తీరి ఊరట పొందుతారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికర వాతావరణం ఉంటుంది. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు.

**తుల:** దూరప్రయాణాలలో వాహన అవరోధాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. నూతన వ్యాపార ప్రారంభ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. బంధు మిత్రులతో కలహా సూచనలున్నవి. నూతన ఋణయత్నాలు చేస్తారు. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

**వృశ్చికం:** ఆర్థికంగా స్థిరమైన ఆలోచనలు చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయి. కీలక వ్యవహారాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది. కుటుంబమున దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి.

**ధనస్సు:** నిరుద్యోగుల శ్రమ ఫలించి నూతన ఉద్యోగ అవకాశాలు అందుకుంటారు. వ్యాపారాలలో నూతన లాభాలు అందుకుంటారు. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది.

**మకరం:** వృధా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తికావు. బంధువర్గంతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది.

**కుంభం:** ఇంటా బయట బాధ్యతలు మరింత చికాకు కలిగిస్తాయి. సోదర వర్గం నుండి కీలక సమాచారం అందుతుంది. సన్నిహితులతో కొన్ని విషయాలలో మాటపట్టింపులు ఉంటాయి. ధన పరమైన చికాకులు పెరుగుతాయి. నిరుద్యోగ యత్నాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. వ్యాపారాలు స్వల్ప నష్ట సూచనలున్నవి.

**మీనం:** దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగంలో ఆశ్చర్యకర సంఘటనలు చోటుచేసుకుంటాయి.

# ఒక్కో రైతు నెత్తిన రూ. 74,121 అప్పు

మొదటి పేజీ తరువాయి

వద్ద అడ్డగోలు వడ్డీ రేట్లకు తీసుకున్న అప్పు భారం ఇంకెంతో. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చెప్పిన వివరాల ప్రకారం.. దేశంలోనే అత్యధిక అప్పు కలిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో ఉండగా, తెలంగాణ ఐదో స్థానంలో ఉంది. రైతులు అత్యధిక అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితాను ఆయన వెల్లడించారు. 2018 జూలై నుంచి 2019 జూన్ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతుల సగటు అప్పు విలువ రూ.2,35,554 ఉన్నట్లు వెల్లడించారు. తెలంగాణ రైతుల సగటు అప్పు రూ.1,52,113 ఉన్నట్లు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. అంటే దేశ సగటుతో పోల్చితే తెలుగు రాష్ట్రాల్లో రైతుల నెత్తిన ఉన్న అప్పు మూడు రెట్లు అధికం.

**అప్పుల మూలాలు:**

- 69.6% రుణాలు బ్యాంకులు, సహకార సంఘాలు, ప్రభుత్వ సంస్థల వంటి అధికారిక మార్గాల ద్వారా అందాయి.
- మిగిలిన 30.4% అప్పులు వడ్డీ వ్యాపారులు, స్నేహితులు, బంధువుల వంటి అనధికారిక మార్గాల ద్వారా తీసుకున్నారు.
- రుణ ఉద్దేశం: సుమారు 57.5% అప్పులను వ్యవసాయ అవసరాల కోసమే తీసుకున్నారు.
- అప్పుల్లో ఉన్న కుటుంబాలు: దేశంలోని మొత్తం వ్యవసాయ కుటుంబాల్లో 50.2% మంది అప్పుల్లో ఉన్నారు.
- సగటు అప్పు: ప్రతి రైతు కుటుంబంపై ఉన్న సగటు అప్పు భారం రూ. 74,121.

**తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఇలా..**

జాతీయ సగటుతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అప్పుల భారం అధికంగా ఉంది. దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 93.2% రైతు కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయి. సగటు అప్పు భారం రూ. 2,45,554 గా ఉంది. తెలంగాణలో 91.7% రైతు కుటుంబాలు అప్పుల్లో ఉండగా, సగటున ఒక్కో కుటుంబంపై రూ. 1,52,113 అప్పు ఉంది. నాబార్డు 2025 నివేదిక ప్రకారం.. 2025 మార్చి నాటికి దేశంలో మొత్తం వ్యవసాయ పరపతి రూ. 2.85 లక్షల కోట్లకు చేరింది, ఇందులో రూ. 1.59 లక్షల కోట్లు చిన్న, సన్నకారు రైతులకే చెందినవి. కాగా, 2026-27 సంవత్సరానికి గానూ సరికొత్త సిట్యుయేషన్ అసెస్‌మెంట్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**అధిక అప్పులు ఉన్న రాష్ట్రాలు**

ఆంధ్రప్రదేశ్: రూ.2,45,554
కేరళ: రూ. 2,42,482
పంజాబ్: రూ. 2,03,249
హర్యానా: రూ. 1,82,922
తెలంగాణ: రూ.1,52,113




**అప్పులకు కారణాలు**

- పెరుగుతున్న పెట్టుబడి వ్యయం ఆందోళన కలిగిస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు విపరీతంగా పెరిగాయి.
- బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు అందకపోవడం వల్ల, రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. అక్కడ వడ్డీ రేట్లు అధికంగా ఉండటంతో రుణ చక్రం నుండి బయటపడలేకపోతున్నారు.
- ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటివి అదనం.
- బ్యాంకు రుణాలను కౌలు రైతులకు కూడా సులభంగా అందేలా చూడాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు.
- ప్రభుత్వం సేకరించిన ధాన్యానికి సంబంధించిన సొమ్మును వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. అలా జరుగుతున్న సందర్భాలు చాలా తక్కువ.

# ఏఐ 'స్టాంప్' పడాలి!

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమలు ఆటోమేటెడ్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది. ప్రముఖ సామాజిక మాధ్యమాలు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటివి ఈ కఠినమైన నిబంధనలు అమలు చేయాల్సి ఉంటుంది. ఏదైనా కంటెంట్ అప్‌లోడ్ చేసే ముందు, ఆ కంటెంట్ ఆర్టిఫిషియల్‌గా జనరేట్ చేయబడిందా లేదా అనే దానిపై యూజర్ డిక్లరేషన్‌ను పొందాలి. ఆ క్లెయిమ్స్ వెరిఫై చేయడానికి ఆటోమేటెడ్ టూల్స్‌ను ఉపయోగించాలి. కంటెంట్ ఏఐ- జనరేటెడ్‌గా ఫ్లాగ్ చేయబడితే, అది లైవ్ కావడానికి ముందు స్పష్టంగా కనిపించేలా లేబుల్ చేయాలి. ఏఐ-జనరేటెడ్ విజువల్స్‌పై స్క్రీన్ స్పేస్‌లో కనీసం 10% కవర్ చేసే కనిపించే వాటర్‌మార్క్‌లు అవసరమయ్యేలా అక్టోబర్ 2025లో సిద్ధం చేసిన డ్రాఫ్ట్ నుండి మునుపటి ప్రతిపాదనను తొలగించింది. కంటెంట్‌లో కేవలం ఫిక్స్‌డ్ సైజ్ వాటర్‌మార్క్ మాత్రమే కాకుండా, కంటెంట్ ఫైనల్ వెర్షన్‌కు స్పష్టమైన లేబులింగ్ అవసరమని పేర్కొంది. ఈ సవరణలు టేక్‌డౌన్ టైమ్‌లైన్స్‌ను కూడా చాలా మేరకు తగ్గించారు. నిర్దిష్ట సందర్భాలలో, ప్లాట్‌ఫామ్‌లకు చట్టబద్ధమైన ఆదేశాలపై చర్య తీసుకోవడానికి ఇప్పుడు కేవలం మూడు గంటలు మాత్రమే ఉన్నాయి, ఇది గతంలో 36 గంటలుగా ఉండేది. ఇతర రెస్పాన్స్ విండోలను 15 రోజుల నుండి ఏడు రోజులకు, 24 గంటల నుండి 12 గంటలకు తగ్గించారు. దీనితో పాటు చట్టవిరుద్ధమైన, అసభ్య, మోసపూరిత కంటెంట్‌ను నిరోధించేందుకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఆటోమేటెడ్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం పేర్కొంది. కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే పడే పెనాల్టీలు,శిక్షల గురించి యూజర్స్‌కు అవగాహన కల్పించేందుకు ప్రతీ 3 నెలలకోసారి యూజర్‌కు సందేశాలు పంపాలని సోషల్ మీడియాలకు ఆదేశాలు జారీచేసింది.

## నేను సభకు రాను: ఓం బిర్లా

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడకుండా మైక్ కట్ చేయడం, సభ నుంచి కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేయడం వంటి కారణాలను ఉదహరించాయి. అదే సమయంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కాంగ్రెస్ మహిళా ఎంపీలపై చేసిన వ్యాఖ్యలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభ స్పీకర్‌గా ఓంబిర్లా అనర్హులు అంటూ ఆయనపై 120మంది ప్రతిపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం జారీ చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభను ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్ ఓంబిర్లాను ఆర్టికల్ 94(సీ) నిబంధనల ప్రకారం ఆయన్ను పదవి నుంచి తొలగించే అధికారం ఉందంటూ కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాకూర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. నరవణే రాసిన పుస్తకం పబ్లిష్ కానప్పటికీ రాహుల్ గాంధీకి చేతికి ఆ పుస్తకం ఎలా వెళ్లిందనేది ప్రశ్నార్థకం. దీనిపై అధికార ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .

## జగన్ అసెంబ్లీకి వస్తారు

**వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ**

తాడేపల్లి, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబు ఫ్రస్టేషనలో ఉన్నారని, ఆయన ఏదోదో చేద్దామనుకుంటున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన బొత్స.. రాష్ట్రంలో పాలనను చంద్రబాబు గాలికొదిలేశారని మండిపడ్డారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయని, వైఎస్ జగన్ అసెంబ్లీకి వస్తారని స్పష్టం చేశారు. అదే సమయంలో చంద్రబాబు పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ' రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగాలేవు. ప్రజలు అర్థాకలితో ఉంటే పట్టించుకోవటం లేదు. రాష్ట్రంలో పాలన గాలికి వదిలేశారు. లడ్డూలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ చెప్పింది.

## సచిన్ ఇంట పెళ్లి సంబురాలు!

మొదటి పేజీ తరువాయి

ఇవ్వడమే కాకుండా, కొత్త జంటకు ప్రధాని మోదీ ఆశీస్సులు అందించారు. "యువ జంటకు మోదీ ఇచ్చిన సలహాలు, ఆశీస్సులు చాలా విలువైనవి" అని సచిన్ తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అలాగే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను కూడా సచిన్ ఫ్యామిలీ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించింది. తాజా సమాచారం ప్రకారం, వివాహ వేడుకలు మార్చి 3న మొదలై, మార్చి 5న ముంబైలో ప్రధాన ఘట్టం జరగనుంది.

## ఓటర్లకు సంజయ్ ప్రలోభాలు

మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకిస్తున్న జీవన్ రెడ్డి, ఇప్పుడు ఏకంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరడం గమనార్హం. ఈ వివాదానికి ప్రధాన సమస్య మున్సిపల్ టికెట్ల కేటాయింపు. సంజయ్ వర్గానికి మెజారిటీ టికెట్లు ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరిగిందని భావిస్తున్న ఆయన, తన అనుచరులను స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దింపడమే కాకుండా, వారికి మద్దతుగా ప్రచారం కూడా నిర్వహించారు. 'నేను అసలైన కాంగ్రెస్ వాదిని.. వలస వచ్చిన వారికి పెద్దపీట వేయడం ఏంటి?' అన్నది జీవన్ రెడ్డి వాదన. దీనికి ప్రతిగా, తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పార్టీలో చేరానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని సంజయ్ కౌంటర్ ఇస్తున్నారు. జీవన్ రెడ్డి వైఖరిపై కాంగ్రెస్ అధిష్టానం కొంత అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది.

# నేడే 'పుర' పోలింగ్

మొదటి పేజీ తరువాయి

గుర్తించి అదనపు బలగాలను మోహరించినట్లు తెలిపారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రం వెలుపల కూడా నిఘా కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 3 వేల మంది అదనపు బలగాలను రంగంలోకి దించామని, ఇందులో టీజీఎస్పీతో పాటు అటవీ, ఎక్సైజ్, సీఐడీ, లీగల్ మెట్రాలజీ విభాగాల సిబ్బంది కూడా ఉన్నారని వివరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచే ప్రచార పర్వం ముగియడంతో సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చిందని, ప్రస్తుతం విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి గస్తీని ముమ్మరం చేసినట్లు డిజిపి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన గత నెల 27 నుంచి ఇప్పటి వరకు పోలీసులు రికార్డు స్థాయిలో తనిఖీలు చేపట్టి మొత్తం రూ. 3.09 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఇందులో రూ. 1.29 కోట్ల నగదు, రూ. 1.21 కోట్ల విలువైన మద్యం, రూ. 15.7 లక్షల విలువైన మాదకద్రవ్యాలు, రూ. 28.69 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులను, జిల్లాల సరిహద్దుల్లో 55 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచామని వెల్లడించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, భయం లేకుండా తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని డీజీపీ సూచించారు.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్

మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రులు, రాష్ట్రంలోని అనేక మంది ప్రముఖులు... ఇలా పెద్దల నుంచి సామాన్యుల వరకు ఎవ్వరిని వదలకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారు. భార్యభర్తలు మాట్లాడుకునేది కూడా విన్నారు. చివరకు వారి కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఆ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఎక్విప్‌మెంట్స్ ఇంకా వారి (బీఆర్ఎస్) దగ్గర ఉన్నట్టుగా అనిపిస్తుంది. మేము అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన విషయాలు కూడా బయటికి వస్తున్నాయన్నది అనుమానంగా ఉంది. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా విచారణ చేస్తోంది. ఇంకా దొంగతనంగా ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం' అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని అన్నారు. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు జరుగుతున్న ఎన్నికల్లో 80శాతం పైగా స్థానాల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ గత రెండేళ్లలో అన్ని ఎన్నికల్లో ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. దీంతో రిఫరెండమని సవాలు విసిరిన నాయకులు సైలెంట్ అయ్యారని విమర్శించారు. అందుకే ఇప్పుడు ఎక్కడ ఏ ప్రచారంలో రిఫరెండం, సెమీఫైనల్స్ అనడం లేదని అన్నారు. ఇందుకు కారణం బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతున్నందుకే ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదిస్తున్నారని మంత్రి పొంగులేటి చెప్పారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

# ప్రభుత్వంలో లంచగొండులు

మొదటి పేజీ తరువాయి

తీసుకున్న రిపోర్టులు సంవత్సరాల తరబడి ఎటువంటి చర్యలు లేక సచివాలయంలో పడి ఉన్నాయన్నారు. సచివాలయ ఉద్యోగస్తులు అవినీతి అధికారుల కొమ్ము కాస్తూ ఏసీబీ, విజిలెన్స్ రిపోర్టులను ఏదో ఓ వంకతో సాగదీసి చివరకు చిన్న పనిష్మెంట్, కేసు డ్రాప్ చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఏసీబీ, విజిలెన్స్ పెండింగ్ కేసులు రెవెన్యూ శాఖలో ఎన్ని ఉన్నాయి సమాచార హక్కు చట్టం ద్వారా 2021 ద్వారా దరఖాస్తు చేస్తే సమాచారం ఇవ్వడానికి నిరాకరించారన్నారు. చివరగా అప్పీల్ చేయగా 27 జనవరి 2026న సమాచారం ఇచ్చారని ఈ సమాచారం పరిశీలిస్తే రాష్ట్ర సచివాలయంలో ఏసీబీ, విజిలెన్స్ శాఖల రిపోర్టులపై తగిన చర్యలు తీసుకోవడం లేదని స్పష్టమవుతోందన్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం వారి శాఖలో మొత్తం 323 ఏసీబీ కేసులు ఉంటే అందులో 5 మాత్రమే డిస్పోజ్ అయ్యాయని మిగిలిన 318 కేసులు వివిధ దశలలో పరిశీలనలో ఉన్నాయని ఈ 323 కేసులలో చాలా మట్టుకు 10 సంవత్సరాల క్రితం నమోదైన కేసులు సైతం ఉన్నాయని పేర్కొన్నారు. ఇక విజిలెన్స్ కేసులు మొత్తం129 ఉంటే అందులో 8 కేసులు మాత్రమే డిస్పోజ్ అయి మిగతా 121 కేసులు సంవత్సరాల తరబడి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఏసీబీ ప్రతిరోజు ఏదో ఓ చోట కేసులు నమోదు చేస్తున్నారు. అవినీతి అధికారుల ఇళ్లు సోదాలు చేసి పెద్ద ఎత్తున డబ్బు,ఆస్తులు పట్టుబడుతున్నాయి. దీనిని ప్రసార మాధ్యమాల్లో హైలైట్ చేస్తున్నాయి. దీంతో ప్రజలు ఏసీబీ పనిని ప్రశంసిస్తూ అవినీతి అధికారులకు శిక్ష పడుతోందని ఇక వారికి లంచాల బెడద తప్పుతుందని భావిస్తున్నారు. కానీ లంచాలు తగ్గకపోగా ఇంకా పెరుగుతున్నాయని అవినీతి అధికారులు ఏసీబీకి ఒకటి కంటే ఎక్కువ సార్లు పట్టుబడుతున్నవారు ఉన్నారని లేఖలో రాశారు. పాలనలో అవినీతి గురించి గతంలో ముఖ్యమంత్రికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సంబంధిత శాఖల కార్యదర్శులకు లేఖలు రాశామని అయితే వాటిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అందువల్ల ఏసీబీ, విజిలెన్స్ కేసులు తొందరగా పరిష్కారమయ్యేటట్లు, అవినీతి అధికారులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

# ఉద్యోగుల ఉసురు పోసుకోకు!

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. వీటితోపాటు.. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల గ్రాట్యుటీ, ఈపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కూడా రాష్ట్ర సర్కార్ చెల్లించడం లేదని మండిపడ్డారు. 2023 జులై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని రెండున్నర సంవత్సరాలు అవుతున్నా.. వాటి గురించి కనీసం మాట్లాడకపోవడం దారుణమని పేర్కొన్నారు. కనీసం పీఆర్సీ నివేదికను కూడా తెప్పించుకోకపోవడం చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఎంతటి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారనే అర్థం చేసుకోవచ్చని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోందని.. ఇది క్షమించరానిదని బండి సంజయ్ పేర్కొన్నారు. జీవితాంతం ప్రభుత్వం కోసం పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే.. వారికి వచ్చే ప్రయోజనాలు అన్నింటినీ చెల్లించి సగౌరవంగా వారిని సన్మానించి ఇంటికి పంపించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. దానికి భిన్నంగా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని కేంద్రమంత్రి విమర్శలు గుప్పించారు. మానవత్వం ఉన్న పాలకులు ఎవరూ ఇంతటి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించరని.. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ అందక గత సంవత్సర కాలం నుంచి ఇప్పటివరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మానసిక వేదనకు గురై చనిపోయినట్లు బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులతోపాటు.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను అన్నింటినీ కలిపితే రూ.12 వేల కోట్లకుపైగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం రూ.2.5 కోట్లకు పైగా బడ్జెట్ కలిగిన తెలంగాణ రాష్ట్రంలో.. ఉద్యోగులకు రూ.12 వేల కోట్ల బకాయిలు చెల్లించడాన్ని భారంగా భావించడం అంటే దాని కన్నా దురదృష్టం ఇంకోటి లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య ధోరణిని వదిలేసి.. ఉద్యోగుల బెన్ఫిట్స్ బకాయిలను యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేకపోతే మున్సిపల్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల తరఫున బీజేపీ భారీ ఎత్తున నిరసన, ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరికలు చేశారు.

# శ్రీనివాస్ రెడ్డికి పొడిగింపు లేనట్లే!?

## పలు వివాదాల నేపథ్యంలో నిర్ణయం!.. మరో అభ్యర్థి కోసం ప్రభుత్వం వేట



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కే శ్రీనివాస్ రెడ్డి పదవి పొడిగింపు లేనట్లేనని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆయన బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి పొడిగించే అవకాశాలు లేవని తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీనివాస్ రెడ్డిని సీఎం రేవంత్ ఏరికోరి తెచ్చుకున్నారు. 2024 ఫిబ్రవరిలో మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ రెండేళ్ల పదవీ కాలం అతి త్వరలో ముగియనుంది. అయితే, పలు అంతర్గత వివాదాల నేపథ్యంలోనే శ్రీనివాస్ రెడ్డికి చైర్మన్‌గా పొడిగింపు అవకాశం ఇవ్వొద్దని సీఎం రేవంత్ నిర్ణయానికి వచ్చినట్లు మీడియా సర్కిళ్లలో చర్చ సాగుతోంది. ఓ సీనియర్ జర్నలిస్టును ప్రభుత్వం సంప్రదించగా, ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. దీంతో మరో వ్యక్తి కోసం ప్రభుత్వం జల్లెడ పడుతున్నట్లు సమాచారం. కాగా, విశాలాంధ్ర, మన తెలంగాణ, ప్రజాపక్షం పత్రికలకు ఎడిటర్‌గా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి.. ఐజేయూ అధ్యక్షుడిగానూ పనిచేశారు. 1949, సెప్టెంబర్ 7న శ్రీనివాస్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని పల్లెపహాడ్ గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. విద్యార్థి దశలోనే శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ (హెచ్ఎస్‌యూ), ఆ తర్వాత ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్)లో చురుకుగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో (చంద్రబాబు హయాంలో) ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సేవలు అందించారు. ఆయనకు రేవంత్ సర్కార్ తెలంగాణ మీడియా అకాడమీ బాధ్యతలు అప్పగించడం అప్పట్లో హాట్ టాపిక్‌గా నిలిచింది.

# మహదేవప్పది కాంగ్రెస్ హత్య: బండి సంజయ్

### మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

నారాయణపేట, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. మహదేవప్ప మృతికి కాంగ్రెస్ పార్టీ నేతలే కారణమని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలు మంగళవారం హైదరాబాదులో డీజీపీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు, నేతలు చేరుకోవడంతో డీజీపీ ఆఫీసు వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బారికేడ్లతో వారిని అడ్డుకునేందుకు యత్నించారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. బారికేడ్లను తోసుకుంటూ డీజీపీ ఆఫీసులోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తోపులాట చోటుచేసుకుంది. ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి కిందపడిపోయారు. పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. కాగా, మహదేవప్ప ఆత్మహత్యపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మహదేవప్పది ఆత్మహత్య కాదని... కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని ఆరోపించారు. ఓటమి భయంతో కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు, అరాచకాలకు పాల్పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదని... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా భూస్థాపితం చేసే రోజులు వచ్చాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే రోజులు రాబోతున్నాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత కాంగ్రెస్ పై యుద్ధం ప్రకటిస్తామని చెప్పారు. బీజేపీ కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, బీజేపీ నాయకత్వం వారికి అండగా ఉంటుందని సంజయ్ తెలిపారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## మంత్రి శ్రీహరి వేధింపుల వల్లే: రాంచందర్ రావు

మహదేవప్ప ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. అధికార పార్టీ కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపుల వల్లే తమ అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. మహదేవప్ప మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, అతని కుటుంబానికి సంతాపం తెలిపారు. మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపుల వల్లే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. మంత్రి శ్రీహరిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని అన్నారు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

## టెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు) : ఎట్టకేలకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు మంగళవారం రాత్రి విడుదలయ్యాయి. రాత్రి 8:30గంటల తర్వాత ఈ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు నిర్వహించారు. ఆ ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఫలితాల కోసం https://schooledu.te langana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. అయితే కొంతసేపు సాంకేతిక కారణాలతో సైట్ మొరాయించడం గమనార్హం. కాగా సోమవారం రాత్రి 11:30 గంటలకు అకస్మాత్తుగా వెబ్‌సైట్‌లో అరగంట పాటు టెట్ ఫలితాలు ప్రత్యక్షమయ్యాయి.

# సీఎం, నీళ్ల మంత్రి ఎక్కడ?

## కృష్ణా నీళ్లను దోచుకుంటున్న ఏపీ.. మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం






హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చోని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఇండెంట్లు లేవు, బోర్డు అనుమతులు లేవు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది.దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది.28న లేఖ రాసిండు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు.ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఈ వాటర్ ఇయర్‌లో జనవరి 29,2026 నాటికి ఏపీ 664 టీఎంసీలు వాడుకున్నది.టెంపరరీ అగ్రిమెంట్ ప్రకారం ఏపీ 66 శాతమే వాడాలి.కానీ 80 శాతం వాడింది.రేవంత్ రెడ్డి, నీళ్ల మంత్రి గడ్డి పీకుతున్నడా..?చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్లుఉత్తరాలు రాయడం తప్ప ఏం చేస్తున్నారు. ముఖ్యమంత్రి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ కోసం అడగడు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. కృష్ణా జలాల వినియోగంలో బీఆర్ఎస్ పాలనతో పోల్చితే కాంగ్రెస్ హయాంలో ఎవర్ లోయెస్ట్ వాడుకున్నం అని ఇప్పటికే అనేక సార్లు చెప్పినం. వరుసగా రెండు సంవత్సరాల్లో అతి తక్కువ కృష్ణా జలాలను వినియోగించి రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గురు దక్షిణ చెల్లిస్తున్నడు. ఈ ఏడాది 20 శాతం దాటలేదు. ముఖ్యమంత్రి వైఫల్యానికి ఇది నిదర్శనం . ముఖ్యమంత్రే ఈ రాష్ట్రం పాలిట శాపంగా తయారైండు. హక్కులు కాపాడాల్సిన ముఖ్యమంత్రి హక్కులను కాలరాస్తున్నడని అన్నారు. పాలన మీద పట్టు లేదు, పట్టి లేదు.. రేవంత్ రెడ్డికి రెండు లేదన్నారు హరీష్ రావు. కేఆర్ఎంబీకి లేఖ రాసి మేం చెప్పిన ఏపీ నీటి వినియోగం వాస్తవం అని ఒప్పుకున్నారు. ఏపీ అడ్డగోలుగా నీళ్లు వాడుతున్నది అడ్డుకోమని ఇప్పుడు లేఖ రాశారు. మేం ప్రశ్నించినప్పుడే మీరు నిద్ర లేచి బాధ్యతగా వ్యవహరించి ఉంటే తెలంగాణకు ఇంత నష్టం అవుతుండేనా..? అని హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నామమాత్రంగా లేఖ రాయడం తప్ప మీరు చేస్తున్నదేం లేదు. 664 టీఎంసీలు ఏపీ తీసుకుపోయిందని ఈఎన్‌సీ కేఆర్ఎంబీకి లేఖ రాస్తే, కేఆర్ఎంబీ రాసిన లేఖలో 555 టీఎంసీలు తీసుకుపోయిందని ప్రస్తావించింది. వంద టీఎంసీలు తక్కువ చేసి కేఆర్ఎంబీ చెబుతున్నది అంటే.. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. ఆర్ఆర్ టాక్స్ ఎక్కడ బయటకు వస్తదో, స్కాంలు ఎక్కడ బయట పడుతవో అని రేవంత్ మౌనంగా ఉంటరు..? బీజేపీ కూడా అట్లాగే మౌనంగా ఉంటది. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని హరీష్ రావు ఆరోపించారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. త్వరలో కేఆర్ఎంబీ ఆఫీస్‌ను ముట్టడిస్తాం. కేంద్ర మంత్రిని కలుస్తాం. పార్లమెంట్ లో గట్టిగా లేవనెత్తుతాం. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు 16 మంది ఉండి తెలంగాణ హక్కులను కాపాడటంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. 19 ప్లేసుల్లో బీఆర్ఎస్ టెలిమెట్రీలు పెడితే.. మిగతా 9 ప్లేసుల్లో పెట్టడంలో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందని హరీష్ రావు పేర్కొన్నారు.

## నా పేరును మార్చడానికి మీరెవరు?

### రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం

న్యూఢిల్లీ: మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## లంచగొండి.. మాదాపూర్ ఎస్సై

### రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): హైదరాబాద్ లో మరో అవినీతి పోలీసు అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్సై వినయ్ ఈరోజు రూ. 50 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయ్యారు. వివరాల్లోకి వెళితే, ఓ కేసు విషయంలో సహకారం అందిస్తానంటూ ఫిర్యాదుదారుడి నుంచి వినయ్ రూ. 50 వేలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడి నుంచి లంచం డబ్బులు తీసుకుంటున్న తరుణంలో ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. ఎస్సైని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నగదును సీజ్ చేశారు. ఎస్సై వినయ్ ని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గోషామహల్‌లో 67 లక్షల క్యాష్ పట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు కొన్ని గంటల ముందు హైదరాబాద్‌లో పోలీసులు పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న రూ.67 లక్షలను గోషామహల్ పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జ్యోతారామ్, గణ్‌పత్‌రామ్, మహేందర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరు ముగ్గురు ముఠాగా ఏర్పడి కొంతకాలంగా నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బేగంబజార్‌కు చెందిన కపిలేశ్ సూచనల మేరకు నిందితులు అఫ్జల్‌గంజ్‌లో ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.67 లక్షలకు పైచిలుకు నగదు తీసుకుని తమ ముఠా సభ్యులకు అప్పగించేందుకు వెళుతుండగా, సమాచారం అందుకున్న పోలీసులు వారి స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో నగదును స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు.

## బీసీ బిల్లులను పరిశీలిస్తున్నాం

### టీజీ రిజర్వేషన్ల బిల్లులపై కేంద్రం కీలక ప్రకటన

న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

## జగ్గారెడ్డిపై సదాశివపేటలో కేసు

సంగారెడ్డి, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై కేసు నమోదయింది. మున్సిపల్ ఎన్నికల నియమావళిని ఉల్లగించారని ఆయనపై సదాశివపేట పీఎస్ లో కేసు నమోదు చేశారు. సదాశివపేటలోని ఓ హోటల్ వద్ద పేదలకు, వృద్ధులకు డబ్బులు పంచుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సీఐ వెంకటేశ్ అక్కడకు చేరుకుని... అక్కడ ఉన్న జగ్గారెడ్డిని, మరికొందరు స్థానికులను అక్కడి నుంచి పంపించివేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో డబ్బులు పంచడం పట్ల పీఎస్ లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మరోవైపు, దీనిపై జగ్గారెడ్డి అనుచరులు స్పందిస్తూ... ఆ హోటల్ వద్ద జగ్గారెడ్డికి టీ తాగే అలవాటు ఉందని... ఆయన అక్కడ ఆగిన సమయంలో తన వద్దకు వచ్చిన పేదలకు, వృద్ధులకు డబ్బులు ఇచ్చినట్టు తెలిపారు.



# 1,511 కోట్ల భూమి సేఫ్

### కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా
### అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు
### రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా
### జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ.1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం - మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫెన్సింగ్ వేసింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది. వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 గజాల మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఆక్రమణలు తొలగించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

## హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): హైదరాబాద్ శివారులో స్వల్పంగా భూప్రకంపనలు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారంలోని మెట్‌ఖాన్‌గూడ ప్రాంతంలో ఉదయం 10:10 గంటలకు భూమి కంపించినట్లు శబ్దం వచ్చింది. దీంతో ఇళ్లలో ఉన్న ప్రజలు బయటకు పరుగు తీశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రకంపనలు రావడంతో వారు ఒక్కసారిగా భయపడి బయటకు వచ్చారు. అయితే ఇది భూమి కంపించడం వల్ల జరిగిందా? లేక చుట్టుపక్కల పేలుడుతో వచ్చిన ప్రకంపనలా అనేది తెలియాల్సి ఉంది. గేటెడ్ కమ్యూనిటీల్లోని సీసీ కెమెరాల్లో భూమి కంపించినట్లు కనిపించింది. స్థానికంగా ఉన్న పాఠశాలకు స్కూల్ యాజమాన్యం సెలవు ప్రకటించింది. స్థానికులు మాట్లాడుతూ, భూమి హఠాత్తుగా కంపించినట్లయిందని, ఏం జరిగిందో తెలియక అందరం బయటకు వచ్చామని చెప్పారు. భారీ శబ్దం వచ్చి భూమి కంపించినట్లు అనిపించిందని అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రెవెన్యూ, సంబంధిత అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

## సీఎం చంద్రబాబా? ఎక్స్‌కు టీజీ పోలీసుల లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): 'తెలంగాణ సీఎం చంద్రబాబా? లేక రేవంత్‌రెడ్డా?' ఈ ప్రశ్నపై తెలంగాణ పోలీసులకు కూడా అనుమానం ఉందేమో. ఎక్స్ వేదికగా వైరల్ అయిన ఒక లేఖ ఈ అనుమానానికి కారణం. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారి పూర్తి వివరాలు అందించాలంటూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఎక్స్ కంపెనీకి రాసిన ఓ లేఖ మంగళవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కేసు విచారణలో ఉన్నదని, ఈ సమయంలో ఎక్స్ వేదికగా చంద్రబాబును విమర్శిస్తూ, అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడుతున్నారని, వారి వివరాలు కావాలంటూ ఆ లేఖలో కోరారు. రిజిస్టర్డ్ యూజర్ డిటైల్స్ అంటే వారి పేరు, యూజర్‌నేమ్, ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, అకౌంట్ తెరిచిన తేదీ, రిజిస్టర్డ్ ఐపీ అడ్రస్, ఐపీ లాగిన్ హిస్టరీ విత్ టైమ్‌స్టాంప్స్, అకౌంట్ కొనసాగించిన పరికరం తదితర వివరాలు ఇవ్వాలంటూ ఎక్స్ (ట్విట్టర్)ను సైబర్‌క్రైమ్ అధికారి కోరినట్టు ఆ లేఖలో ఉన్నది. దీంతో ఈ లేఖపై నెటిజన్లు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టుల మీద టీడీపీగానీ, చంద్రబాబుగానీ, ఆయన అభిమానులుగానీ ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులే సుమోటోగా అమెరికాకు లేఖలు రాస్తున్నారంటూ ఆరోపించారు.

## అడ్వకేట్లు.. 'చెల్లని' ఓట్లు!

### బార్ కౌన్సిల్ ఎన్నికల ఓట్ల లెకింపు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు గత నెల 30న జరిగిన ఎన్నికల ఓట్ల లెకింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. మొత్తం 23 మంది బార్ కౌన్సిల్ సభ్యుల పదవులకు పడిన ఓట్లను ప్రాధాన్యతా క్రమంలో అధికంగా ఓట్లు సాధించిన వాళ్లను ఎన్నికైనట్టు ప్రకటిస్తారు. ఈ 23 మందిలో ఐదుగురు మహిళలు ఉంటారు. మొత్తం 203 మంది న్యాయవాదులు ఈ ఎన్నికల్లో పోటీ చేయగా, వీరిలో 55 మంది మహిళా న్యాయవాదులు ఉన్నారు. ఇప్పటివరకు లెక్కించిన ఓట్లలో దాదాపు 41 శాతం చెల్లకుండా పోవడంపై న్యాయవాదులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏడేండ్ల తరువాత ఎన్నికలు జరుగడంతో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

నల్గొండ జిల్లా దామరచెర్ల మండలం వీర్లపాలెం-వీరప్పగూడెంల దక్షిణ సరిహద్దుగా పారుతున్న కృష్ణా నది ఎడమ ఒడ్డున మూడు వేల సంవత్సరాల క్రితం నుంచి క్రీ.శ. 15 వ శతాబ్దం మధ్య మనుగడ సాగించిన మహానగరం శిథిలాలు నాకు నిన్న అనుకోకుండా తారసపడ్డాయి. ఇక్కడ బృహత్శిలా యుగపు సమాధులు (కెయిరనులు) వందలకొలది ఉన్నాయి.

వీటిని స్థానికులు వీరుల సమాధులుగా భావించేవారు కాబట్టి ఈ ప్రాంతానికి వీరులపాడు, వీరప్పగూడెం అనే పేరొచ్చింది. జీవనది అయిన కృష్ణా నది.. నీటిని, చేపలను, ఇతర జీవాధార వనరులను పుష్కలంగా సమకూర్చింది కాబట్టి ఇక్కడ సుమారు మూడు వేల సంవత్సరాల కిందట ఒక మహానగరం మనుగడ సాగించడానికి అవకాశం ఏర్పడింది. బృహత్ శిలలను పగులగొట్టే ఇనుమును కూడా ఇక్కడే తయారు చేసుకున్నారు అనడానికి నిదర్శనంగా ఇక్కడ పలు చోట్ల ఇనుప చిట్టాలున్నాయి.





# మరుగునపడిన మహానగరం



రెండేసి గజాల పొడవు, గజం ఎత్తైన నాలుగు రాళ్ళతో నాలుగు గోడలుగా నిర్మించి ఆ నిర్మాణం పైన మరో చదునైన కప్పు రాయిని పరిచి ఈ సమాధులను నిర్మించారు. కృష్ణా తీరంలో ఇదివరకే పలు చోట్ల ఇలాంటి సమాధులలో తవ్వకాలు చేపట్టి పురావస్తు శాఖ గత దశాబ్దాలలో మూడు వేల సంవత్సరాల కిందటి తెలంగాణ జీవన సాంస్కృతిక విశేషాలనెన్నింటినో బయటపెట్టింది. అయితే ఈ వీర్లపాడు స్థలం మాత్రం పురావస్తు శాఖ దృష్టిలో లేదు. ఈ సమాధి రాళ్ళకు వాడిన ముడి రాయి ఇక్కడే బంజరు రాళ్ళ పేరుతో పుష్కలంగా అందుబాటులో ఉంది. శాస్త్రీయంగా పల్నాడు రాళ్ళుగా పిలిచే వీటి లభ్యత ఆధారంగానే ఈ ప్రాంతంలో సుమారు యాభై ఏళ్ళ కిందట ఒక సిమెంట్ కంపనీ ఏర్పడింది. ఆ కంపనీతో పాటు స్థానికులు కూడా వందలాది సమాధులపై రాళ్ళను తమ అవసరాల కోసం తీసుకుపోతుండడంతో ఇప్పుడు అతికొద్ది సంఖ్యలో మాత్రమే బృహత్శిలా సమాధులు పూర్తి స్థాయిలో కనిపిస్తాయి. ఇక గుప్తనిధుల దొంగలు కూడా అనేక సమాధులను పెకలిస్తున్నారు. కాబట్టి అతికొద్ది రోజుల్లో అవి కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.





బృహత్శిలా యుగం తరువాత సుమారు వేయి ఏండ్లు మానవ మనుగడ ఎలా కొనసాగిందో తెలిపే ఆధారాలు మృగ్యం. అయితే మళ్ళీ మధ్య యుగాలలో... సుమారు వెయ్యేళ్ళ క్రితం నుంచి కట్టిన కోట గోడలు, బురుజులు, ఇండ్లు, గోదాములు, ధాన్యాగారాలు, గుళ్ళు, విగ్రహాలు, రోళ్ళు, బావులు, తదితర నిర్మాణాలు కనిపిస్తున్నాయి. కృష్ణా నది పారుతున్న దక్షిణం వైపు సాధారణ ద్వారం కలిగిన కోట గోడలు సుమారు 70 మీటర్ల చతురస్రాకారంలో (5000 చదరపు మీటర్లు .. అంటే ఎకరంన్నర వైశాల్యం) నిర్మితమై ఉన్నాయి. కోటగోడల మధ్యలో ఎత్తైన భవనపు పునాదులు ఉన్నాయి. కోటకు ఆగ్నేయంలో అల్లంత దూరంలో ఒక ఎత్తైన బురుజు ఉంది. దీనిని దూరం నుంచి వచ్చే శత్రువులను గుర్తించడానికి ఉపయోగించేవారు. కోటగోడలకు ఈశాన్యంలో వనదుర్గ, పోషమ్మ, పోతరాజు, వీరభద్రుడు, దంపతుల వీరగల్లు, పురుష యోధుడి వీరగల్లు ఉన్నాయి. వాటి గుడిని ఎవరో ధ్వంసం చేశారు.







వాస్తు శిల్ప లక్షణాలను బట్టి ఈ కోటగోడలు, విగ్రహ శిల్పాలను స్థానిక కందూరి చోళుల కాలం నుంచి రేచర్ల పద్మనాయకుల కాలం మధ్య.. అంటే, క్రీస్తు శకం 10 - 15 శతాబ్దాల మధ్య కట్టించారని చెప్పవచ్చు. కాకతీయ రాణి రుద్రమదేవి (క్రీస్తు శకం 13 వ శతాబ్దంలో) ఇక్కడి కోటలో ధాన్యరాశులను నిల్వ ఉంచేది అని స్థానికుల కథనం. అందుకు నిదర్శనంగా ఆరు గజాల వ్యాసంతో పలు గుండ్రటి ధాన్యాగార నిర్మాణాలు కనిపిస్తున్నాయి. లోపలి వైపు డంగు సున్నం వేసి ధాన్యాలు బయటికి జారిపోకుండా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ పెంకులు పెద్దగా లభించకపోవడం వల్ల మధ్యయుగాలలో ఈ కోట ప్రాంతం సాధారణ నివాస స్థలంగా కాకుండా శత్రువుల నుంచి రక్షణ కోసం రహస్య ధాన్యాగారంగా మనుగడ సాగించిందనే చెప్పవచ్చు. కోటకు దక్షిణాన ఫర్లాంగ్ దూరంలో .. కృష్ణా ఒడ్డున రేచర్ల పద్మనాయకుల కాలపు (క్రీస్తు శకం 14–15 శతాబ్దాలు) లక్ష్మీనరసింహాలయం ఉంది. ఇప్పుడు ఆ ఆలయపు అంతరాళం పూర్తిగా, గర్భగుడి పాక్షికంగా మిగిలి ఉన్నాయి. ముఖ మండపం పూర్తిగా ధ్వంసం అయింది. ఆలయంలోని లక్ష్మీనరసింహస్వామి విగ్రహం, వైష్ణవమూర్తి, ఆయన దేవేరులు (ఆది లక్ష్మి, చెంచు లక్ష్మి) విగ్రహాలను దుండగులు బయట పడేసి ముక్కలుగా విరుగగొట్టారు. నేను పరిసర ప్రాంతాల్లో వెతికి ఆ ముక్కలను అతుకపెడితే పైన పేర్కొన్న విగ్రహాల రూపు రేఖలు స్పష్టముగా గోచరించాయి. ప్రధాన విగ్రహం పీఠానికి గరుడుడు రేఖ చిత్రం చెక్కి ఉండడం వల్ల, ఆలయ సమీపంలో రెండున్నర గజాల పొడవైన హనుమంతుని శిల్పం ఉండడం వల్ల ఈ ఆలయ విగ్రహ నిర్మాణాలు చేపట్టింది రేచర్ల పద్మనాయకులు అని స్పష్టమయింది. సిమెంట్ కంపనీ, స్థానికులు ఇక్కడి బృహత్ శిలా యుగపు సమాధి రాళ్ళను తమ అవసరాల కోసం విరివిగా ఉపయోగించుకుంటున్నారు కాబట్టి అవి త్వరలోనే పూర్తిగా కనుమరుగు కాకముందే వాటిని వెంటనే పురావస్తు శాఖ కనీసం డాక్యుమెంట్ అయినా చేసి మన చారిత్రిక సంపదను భావి తరాలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

- డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ
చరిత్రకారుడు, 9490957078

## సురక్షిత బ్యాంకింగ్‌కు కేవైసీ కీలకం

**యూబీఐ నిజామాబాద్ రీజనల్ ఏజీఎం శ్రీలత**

మల్యాల, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): సురక్షిత బ్యాంకింగ్‌కు కేవైసీ అత్యంత కీలకం అని యూబీఐ నిజామాబాద్ రీజనల్ ఏజీఎం శ్రీలత అన్నారు. ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలలో సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ





వివరాలను నవీకరించుకోవడం, సైబర్ భద్రతపై జాగ్రత్తలు పాటించడం, ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ముఖ్యమని అన్నారు. ప్రతి ఖాతాదారుడు తన బ్యాంకు ఖాతాల కేవైసీ వివరాలను వెంటనే నవీకరించుకోవాలని కోరారు. కేవైసీ నవీకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండటమే కాకుండా, ఖాతాల దుర్వినియోగాన్ని నివారించవచ్చని, లావాదేవీలు మరింత సురక్షితంగా ఉంటాయన్నారు. ప్రజలు తమ ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డులు వంటి గోప్యమైన బ్యాంకింగ్ సమాచారాన్ని ఎవరికీ పంచుకోకూడదని, ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మల్యాల శాఖ మేనేజర్ జహీర్ పాషా, ఆర్ఏబీడీ హెడ్ వైభవ్, జిల్లా ఎఫ్ఎల్సీ మధుసూదన్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రమేశ్, వెంకటేశ్, విజయ్, యూబీఐ బీసీ పాయింట్ నిర్వాహకుడు బొమ్మకంటి గంగాధర్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఉప సర్పంచ్ జంగిలి శ్రీశైలం, వార్డు సభ్యులు శ్రీనివాస్, అశ్విని, బక్కయ్య, వీవోఏ శ్యామల, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలయాల నిర్వహణలో బాబు విఫలం

**శ్రీశైలం శివభక్తులపై లాఠీచార్జ్ గర్హనీయం.. హలో ఇండియా అంటూ జగన్ ట్వీట్**

తాడేపల్లి, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): శ్రీశైలంలో శివమాల ధరించిన భక్తులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారంటూ వైసీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ఆలయాలకు వెళ్లే భక్తులకు భద్రత కరువైందని, భక్తితో యాత్రలు చేసేవారు నేడు భయంతో ఆలయాలకు వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఘోర వైఫల్యాల వల్లే పవిత్ర పుణ్యక్షేత్రాల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు "హలో ఇండియా" అంటూ ట్వీట్ చేశారు. "శ్రీశైలం ఆలయంలో శివమాల ధరించిన భక్తులపై పోలీసుల లాఠీఛార్జ్ ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యానికి పరాకాష్ఠ. ఏటా మహాశివరాత్రికి పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇచ్చే సమయాన్ని ఏడు రోజులకు కుదించారు. దీనివల్ల భక్తులు భారీగా తరలివస్తారని తెలిసినా, అధికారులు కనీస ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో గంటల తరబడి పిల్లాపాపలతో భక్తులు నరకయాతన అనుభవించారు" అని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ భక్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో, పోలీసులు వారిపై విచక్షణారహితంగా లాఠీలతో దాడి చేయడం అత్యంత బాధాకరమని జగన్ పేర్కొన్నారు.



కేవలం ప్రచార విన్యాసాలు, ఘటన జరిగిన తర్వాత రొటీన్ సమీక్షలకే ప్రభుత్వం పరిమితమవుతోందని, జవాబుదారీతనం అన్నదే కనిపించడం లేదని ఆరోపించారు. "2025 జనవరిలో తిరుపతి వైకుంఠ ఏకాదశి టోకెన్ల తొక్కిసలాటలో ఆరుగురు, ఏప్రిల్‌లో సింహాచలంలో గోడ కూలి ఏడుగురు, నవంబర్‌లో కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు మరణించారు. ఈ ఘటనల తర్వాత కూడా ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదు. తిరుమల లడ్డూ వంటి పవిత్రమైన అంశాలను రాజకీయాల్లోకి లాగి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఇప్పుడు ఈ నీచ రాజకీయాలు రాష్ట్రంలోని అన్ని ఆలయాలకూ వ్యాపిస్తున్నాయి" అని జగన్ విమర్శించారు. సనాతన ధర్మం గురించి పదేపదే మాట్లాడే చంద్రబాబు, పవన్ కల్యాణ్.. భక్తులపై లాఠీ దెబ్బలు పడుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యత వహించి, భక్తులకు క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జగన్ డిమాండ్ చేశారు.

## ఆత్మరక్షణలో చంద్రబాబు: భూమన



తిరుమల, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): తిరుమల లడ్డూపై సిట్ ఇచ్చిన రిపోర్ట్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. చంద్రబాబు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారని ఎద్దేవా చేశారు. అందుకే కొంత మంది స్వాములను భయపెట్టి చంద్రబాబు లేఖలు రాయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద జీయర్ స్వామితో బీఆర్ నాయుడు, ముద్దాడ రవిచంద్ర బలవంతంగా లేఖ రాయించారని అన్నారు. చంద్రబాబు ఆడుతున్న క్షుద్ర రాజకీయ క్రీడలో ఆధ్యాత్మికవేత్తలు కూడా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాములను భయపెట్టి చంద్రబాబు ఏం సాధించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని అన్నారు. చంద్రబాబు రెడ్ బుక్ పాలన చివరకు పెద్ద జీయర్ స్వామిపైకి కూడా మళ్లిందని భూమన విమర్శించారు. కొంతమంది స్వాములకు భక్తి కంటే పైరవీలే ఎక్కువ అవసరమని అన్నారు. దర్యాప్తు సంస్థలు ఇచ్చిన నివేదికలపై ఎల్లో మీడియా దాడి చేస్తోందని మండిపడ్డారు. లడ్డూ అంశంలో రాజకీయ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని సిట్ తన నివేదిలో స్పష్టం చేసిందని చెప్పారు. హైందవ సమాజానికి చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## విశాఖ మెట్రోకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**చంద్రబాబుతో భేటీలో తెలిపిన మనోహర్ లాల్ ఖట్టర్**

వైజాగ్, ఫిబ్రవరి 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ శుభవార్త అందింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఈ మేరకు ఈ సానుకూల స్పందన లభించడం గమనార్హం. సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబు, ఇవాళ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతి ఇస్తున్నట్లు ఖట్టర్ స్వయంగా చంద్రబాబుకు తెలిపినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో విశాఖ మెట్రో ఏర్పాటులో కీలక ముందడుగు పడినట్లయింది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైల్ ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. తాజాగా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో విశాఖ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంతో త్వరలోనే పనులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడ మెట్రో ప్రతిపాదనపై కూడా త్వరలో స్పష్టత రావచ్చని అధికారులు భావిస్తున్నారు.



# నాకు 130 మంది ఎమ్మెల్యేల మద్దతు

## డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు?

కర్ణాటక రాష్ట్ర రాజకీయాలు మళ్లీ హీటెక్కాయి. కర్ణాటక సీఎం పీఠం పై డీకే శివ కుమార్ కన్నేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఢిల్లీలో కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ మకాం వేసినట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దాదాపు రెండు రోజులుగా ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ఢిల్లీలోనే ఉంటున్నారట.

బెంగళూరు: కాంగ్రెస్ పెద్దలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారట ట్రబుల్ షూటర్ డీకే శివ కుమార్. కర్ణాటకలోని నీటిపారుదల ప్రాజెక్టుల సమస్యలపై చర్చించేందుకు ఢిల్లీ వెళ్లానని డీకే శివ కుమార్ చెప్పినప్పటికీ.. అసలు మ్యాటర్ అది కాదట. సీఎం కుర్చీ పై మరోసారి డీకే శివ కుమార్ కన్నేసినట్లు తెలుస్తోంది. 130 మంది ఎమ్మెల్యేల మద్దతు తనకు ఉందని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను కలుస్తున్నారట. పార్టీని అధికారంలోకి తాను తీసుకువచ్చాను..తన కష్టం పైన కాంగ్రెస్ గెలిచిందనే విషయాన్ని కాంగ్రెస్ పెద్దలతో చర్చిస్తున్నారట. రెండున్నర ఏళ్ల ఫార్ములా ప్రకారం డీకే శివకుమార్ కు అవకాశం ఇవ్వాలని ఆయన వర్గం కూడా కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలోనే కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ముఖం వేసిన నేపథ్యంలో ఇటు సిద్ధ రామయ్య వర్గం కూడా స్పందిస్తోంది. ప్రస్తుతం కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు లేదని.. ఈ మధ్య కాలంలో దానిపై చర్చ అనేది జరగబోదని వెల్లడిస్తున్నారు సిద్ధ రామయ్య వర్గం ఎమ్మెల్యేలు. సిద్ధ రామయ్య ఇప్పుడే పదవి నుంచి తప్పు కోవాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేస్తున్నారు. డీకే శివ కుమార్ కేవలం కర్ణాటక రాష్ట్ర ప్రయోజనాల పై కేంద్ర పెద్దలతో అలాగే పార్టీ పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలతో సమావేశం అయ్యేందుకు మాత్రమే వెళ్లారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఇందులో కర్ణాటక సీఎం మార్పు అనే సమస్య లేదని, కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు సిద్ధ రామయ్య వర్గం ఎమ్మెల్యేలు.

### డీకేకు సీఎం పదవి: ఎమ్మెల్యే ఇక్బాల్

డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని సుమారు 90 మంది ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించారు. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా ఒక్క అవకాశం ఇవ్వాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారని, ఇప్పుడు ఆ నిర్ణయం పార్టీ పెద్దల చేతుల్లోనే ఉందని అన్నారు. తమది క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, అందుకు తగినట్లుగా వ్యవహరించాలని అన్నారు. యతీంద్ర సిద్ధరామయ్య తన తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా మారిందని అన్నారు. ఆయన తన వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదని అన్నారు. డీకే శివకుమార్‌కు అవకాశం ఇవ్వాలనేది మా అందరి కోరిక, దాని గురించి పదేపదే బహిరంగంగా ప్రకటనలు చేసి గందరగోళం సృష్టించకూడదని అన్నారు.

# ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భారత్ సూపర్

### వరల్డ్ బ్యాంక్ ర్యాంకింగ్స్ లో పైపైకి


**పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద**

న్యూఢిల్లీ: వ్యాపార సౌలభ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో గత ఐదేళ్లలో భారత్ ఏకంగా 79 ర్యాంకులు మెరుగుపరుచుకుంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. వరల్డ్ బ్యాంక్ గ్రూప్ గతంలో ప్రచురించిన ర్యాంకింగ్స్‌లో ఈ పురోగతి నమోదైందని ఆయన తెలిపారు. వరల్డ్ బ్యాంక్ 2020లో 'డూయింగ్ బిజినెస్ రిపోర్ట్'ను నిలిపివేసిందని, దాని స్థానంలో 2024లో 'బీ-రెడీ' పేరుతో కొత్త అసెస్‌మెంట్‌ను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. 180 దేశాల్లో వ్యాపార జీవితచక్రంలోని 10 అంశాల ప్రాతిపదికన ఈ అంచనా ఉంటుందని చెప్పారు. 2026లో విడుదల కానున్న మూడో బీ-రెడీ నివేదికలో భారత్‌ను కూడా చేర్చనున్నట్టు ఆయన వివరించారు. దేశంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం పలు చర్యలు చేపట్టిందని జితిన్ ప్రసాద అన్నారు. ఇందులో భాగంగా 2014లో 'వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక'ను ప్రారంభించినట్టు తెలిపారు. సింగిల్ విండో వ్యవస్థలు, భవన నిర్మాణ అనుమతుల సరళీకరణ, డిజిటల్ సేవలు వంటివి ఇందులో భాగమని పేర్కొన్నారు. ఈ ప్రణాళిక కింద ఇప్పటివరకు ఏడుసార్లు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేసినట్టు మంత్రి వివరించారు. దీని ద్వారా రాష్ట్రాల స్థాయిలో 9,700కు పైగా సంస్కరణలు అమలయ్యాయని తెలిపారు. అంతేకాకుండా, 2020లో ప్రారంభించిన 'నిబంధనల భారం తగ్గింపు' కార్యక్రమం కింద వ్యాపారాలు, పౌరులపై భారం మోపుతున్న 47,000కు పైగా నిబంధనలను గత ఐదేళ్లలో తగ్గించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

# మోదీపై దాడికి ప్లాన్.. ఇదుగో ప్రూఫ్

**వీడియో షేర్ చేసిన కిరణ్ రిజిజు**

న్యూఢిల్లీ: కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ కిరణ్ రిజిజు ఫిబ్రవరి 4న లోక్ సభ లోపల ప్రతిపక్ష ఎంపీలు వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. లోక్ సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు ఇటీవల స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధానిని సభకు రావొద్దని సూచించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను రిజిజు తన ఖాతాలో షేర్ చేశారు. ఫిబ్రవరి 4వ తేదీన పార్లమెంటులో కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఈవిధంగా చేసిన ఆందోళనను, వారి అవమానకరమైన ప్రవర్తనను చూసి ఆ పార్టీ నేతలు గర్వపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ సమయంలో బీజేపీ ఎంపీలు ఎంతో సహనంతో ఉన్నారని తెలిపారు. బీజేపీ ఎంపీలు సహనం కోల్పోయి ఉంటే పరిస్థితి చేయిదాటిపోయేదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు గౌరవం, పవిత్రతను కాపాడేందుకు బీజేపీ ఎంపీలు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. కిరణ్ రిజిజు షేర్ చేసిన వీడియోలో కాంగ్రెస్ ఎంపీలు బ్యానర్ పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రధానమంత్రి సీటు వద్ద ఆందోళన చేస్తున్నట్లుగా ఉంది.





# బాబ్రీ మసీదు కట్టం

**పునర్నిర్మాణం సాధ్యం కాదు**

**ప్రయత్నాలను అడ్డుకుంటాం**

**యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**

లక్నో: బాబ్రీ మసీదు పునర్నిర్మాణంపై ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మసీదు పునర్ నిర్మాణం సాధ్యం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఈ ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన ఉద్ఘాటించారు. కాగా, శతాబ్దాలుగా సాగుతోన్న రామజన్మభూమి- బాబ్రీ మసీదు వివాదంపై 2019 నవంబర్ 9న సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. వివాదాస్పద భూమి రామజన్మభూమి ఆలయ నిర్మాణానికి అప్పగించి, దానికి ప్రత్యామ్నాయంగా మసీదు నిర్మాణం కోసం ముస్లిం వర్గానికి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అయోధ్య సమీపంలోని ధన్నిపూర్‌లో ఐదు ఎకరాలను యూపీ ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలంలో మసీదు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆసుపత్రి, లైబ్రరీ, మ్యూజియంతో కూడిన కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఈ తరుణంలో యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తీర్పు వెలువడిన రోజు కోసం ఎదురుచూసేవారి కలలు ఎప్పటికీ నెరవేరవని, అలాంటి రోజు ఎప్పటికీ రాదని యోగి స్పష్టం చేశారు. మంగళవారం బారాబంకిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యూపీ సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. తన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. దాని పని పరిధిని మాత్రమే తమ ప్రభుత్వం మాట్లాడుతుందని అన్నారు. అయోధ్యపై బీజేపీ వైఖరిని గుర్తుచేసుకుంటూ.. 'మేము రాముడి కోసం వస్తాం.. అదే స్థలంలో ఆలయాన్ని నిర్మిస్తామని చెప్పాం.. ఇందులో ఏదైనా సందేహం ఉందా?' అని పేర్కొన్నారు. భారత వారసత్వం, అద్భుతమైన సంప్రదాయాలు, సనాతన ధర్మం పట్ల గౌరవాన్ని నొక్కిచెప్పిన యోగి.. కాషాయ జెండా ఎల్లప్పుడూ దేశ గౌరవాన్ని పెంపొందిస్తూనే ఉంటుందని అన్నారు. అయోధ్యలోని రామమందిరంపై ప్రధాని మోదీ ధ్వజారోహణాన్ని గుర్తుచేస్తూ.. దానిని సనాతన చిహ్నంగా అభివర్ణించారు. సంక్షోభ సమయాల్లోనే శ్రీరాముడ్ని గుర్తుచేసుకుంటారని, లేకపోతే ఆయనను మరచిపోతారని.. ఇలాంటి అవకాశవాదులను రాముడు కూడా మరచిపోయాడని సీఎం అన్నారు. రామ భక్తులపై కాల్పులు జరిపి, రాముడి లక్ష్యాన్ని అడ్డుకున్న వారికి ఇక చోటు లేదని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే, శాంతిభద్రతల విషయంలో యూపీ సీఎం హెచ్చరికలు చేశారు. నిబంధనల ప్రకారం నడుచుకుని, చట్టాన్ని పాటించేవారు ప్రయోజనం పొందుతారని, లేకుంటే నరకం వైపు వెళ్తారని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించడం ద్వారా స్వర్గానికి చేరుకోగలమని నమ్మేవారి కలలు ఎప్పటికీ నెరవేరవని అన్నారు. కాగా, మసీదు నిర్మాణ కోసం ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటయ్యింది. ఈ బోర్డు ఆధ్వర్యంలో నిధుల సేకరణ కూడా జరుగుతోంది.


# లిబియాలో పడవ మునిగి 53 మంది మృతి

న్యూఢిల్లీ: లిబియా తీరంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. వలసదారులు, శరణార్థులతో వెళుతున్న ఒక రబ్బరు బోటు మధ్యధరా సముద్రంలో మునిగిపోవడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) అధికారికంగా ధృవీకరించింది. లిబియాలోని అల్-జావియా నుంచి గురువారం రాత్రి 55 మందితో ఈ బోటు బయలుదేరింది. ప్రయాణం మొదలైన ఆరు గంటల తర్వాత, జువారా తీరానికి సమీపంలో బోటులోకి నీరు చేరి మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో ఒకరు తన భర్తను కోల్పోగా, మరొకరు తన ఇద్దరు పిల్లలను కోల్పోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటన గత గురువారం జరిగినా, ఐఓఎం సోమవారం దీన్ని వెలుగులోకి తెచ్చింది. 2026లో ఇప్పటివరకు మధ్యధరా సముద్రం దాటే ప్రయత్నంలో దాదాపు 500 మంది మరణించడం లేదా గల్లంతవడం జరిగిందని ఐఓఎం తెలిపింది. ముఖ్యంగా శీతాకాలంలో స్మగ్లర్లు నడిపే పడవలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, చాలా సంఘటనలు నమోదు కావడం లేదని పేర్కొంది. 2011లో గడాఫీ మరణం తర్వాత లిబియాలో అస్థిరత పెరిగింది. ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వెళ్లే వలసదారులకు ఇది ప్రధాన మార్గంగా మారింది. హింస, దోపిడీ, బలవంతపు చాకిరీ వంటి భయానక పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకే ప్రజలు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో, మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అరికట్టడంతో పాటు, వలసలకు చట్టబద్ధమైన, సురక్షితమైన మార్గాలను ఏర్పాటు చేయాలని ఐఓఎం అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది.



# నరవణె బుక్ పబ్లిష్ చేయలేదు

న్యూఢిల్లీ: ఆర్మీ మాజీ చీఫ్, జనరల్ ఎంఎం నరవణె పుస్తకంపై అన్ని హక్కులు తమకే ఉన్నాయని ప్రముఖ పబ్లిషింగ్ కంపెనీ పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా పేర్కొంది. ఈ పుస్తకం విషయంలో నెలకొన్న వివాదంపై తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'కి ప్రభుత్వం నుంచి అనుమతి ఇంకా లభించకపోవడంతో ముద్రణ చేపట్టలేదని వివరించింది. ఒక్క కాపీ కూడా ప్రింట్ చేయలేదని, డిజిటల్ రూపంలోనూ మార్కెట్లోకి విడుదల చేయలేదని స్పష్టం చేసింది. ప్రింట్, పీడీఎఫ్, ఆన్ లైన్.. ఆ బుక్ ఏ రూపంలో మార్కెట్లోకి వచ్చినా అది కాపీరైట్ ఉల్లంఘనేనని పెంగ్విన్ సంస్థ పేర్కొంది. అనధికారికంగా ఈ బుక్ ను ప్రింట్ చేసిన, ఆన్ లైన్ లో రిలీజ్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. సరిహద్దుల్లో చైనా సైన్యంతో జరిగిన భారత బలగాల ఘర్షణకు సంబంధించి నరవణె ఈ పుస్తకంలో పలు విషయాలను వెల్లడించారు. ఈ వివాదాస్పద అంశాలను రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే, నరవణె పుస్తకం అసలు పబ్లిష్ కాలేదని, మార్కెట్లోకి రాని పుస్తకంలోని విషయాలను సభలో ప్రస్తావించడమేంటని అధికార పక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో మరుసటి రోజు రాహుల్ గాంధీ నరవణె బుక్ ను సభకు తీసుకెళ్లారు. దీంతో వివాదం రేగింది. రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి ఇవ్వకుండా మాజీ సైన్యాధిపతి రాసిన పుస్తకం ఎలా పబ్లిష్ అయిందనే ప్రశ్నలు ఉదయించాయి. ఈ వివాదం నేపథ్యంలో నరవణె పుస్తకం ఆన్ లైన్ లో ప్రత్యక్షమైంది. పీడీఎఫ్ ఫార్మాట్లో పలు సైట్లలో అందుబాటులోకి వచ్చింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ పోలీసులు సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో పెంగ్విన్ సంస్థ ప్రచురణకు ముందు రూపొందించిన పీడీఎఫ్ ప్రతి కొన్ని వెబ్‌సైట్లలో అందుబాటులో ఉందని గుర్తించినట్లు తెలిపారు.







# వొడాఫోన్‌కు బైబై

**డిసెంబర్‌లో 9.40 లక్షల సబ్‌స్క్రైబర్ల గుడ్‌బై**

న్యూఢిల్లీ: గతేడాది డిసెంబర్‌లో ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా భారీగా సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. ఇదే సమయంలో దిగ్గజ భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ఎప్పటిలాగే కొత్త సబ్‌స్క్రైబర్లను సాధించాయి. మంగళవారం టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన డేటా ప్రకారం, సమీక్షించిన నెలలో ఎయిర్‌టెల్ కొత్తగా 54.3 లక్షల మంది కస్టమర్లను చేర్చుకోగా, జియో 29.6 లక్షల మందిని సంపాదించుకుంది. ఇక, వొడాఫోన్ ఐడియా 9.4 లక్షల మందిని, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ 2.1 లక్షల మంది వినియోగదారులను కోల్పోయాయి. దీంతో మొత్తం వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2025, డిసెంబర్ చివరి నాటికి 125.87 కోట్లకు పెరిగింది. ఇందులో పట్టణ ప్రాంతాల్లో 71.3 కోట్ల నుంచి 72 కోట్లకు పెరగ్గా, గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌స్క్రైబర్లు 53.72 కోట్ల నుంచి 53.86 కోట్లకు పెరిగారు.

# ఎవరివో ఆ రూ.72,454 కోట్లు!

**బ్యాంకుల్లో భారీగా క్లెయిమ్ చేయని డిపాజిట్లు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు రూ. 72 వేల కోట్లకు పైగా ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. మంగళవారం రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలను తెలియజేశారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఆధ్వర్యంలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(డీఈఏ) ఫండ్‌లో 10 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువకాలం వాడకుండా, క్లెయిమ్ చేయకుండా ఉన్న నిధులు ఈ ఏడాది జనవరి 28 నాటికి రూ. 72,454 కోట్లు ఉన్నాయి. డేటా ప్రకారం, ప్రభుత్వ రంగ బ్యాంకుల డిపాజిట్లు రూ.60,571.02 కోట్లు కాగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల డిపాజిట్లు రూ.9,607.76 కోట్లు, విదేశీ బ్యాంకుల డిపాజిట్లు రూ.2,275.01 కోట్లు. తద్వారా మొత్తం డీఈఏ ఫండ్‌లో రూ. 72,454 కోట్లు నిల్వలు ఉన్నాయి. ప్రజలు తమ డబ్బును క్లెయిమ్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆర్‌బీఐ ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. ఆర్‌బీఐ ఉద్గమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇందులో కస్టమర్లు వివిధ బ్యాంకులలో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను తెలుసుకోవచ్చు.

# కాంగ్రెస్ నేతలపై హిమంత 500 కోట్ల దావా

గౌహతి: అసోం అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ఈ క్రమంలో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, ఆయన కుటుంబ సభ్యులు 1,200 ఎకరాల భూములు ఆక్రమించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో, కాంగ్రెస్ నేతలు జితేంద్ర సింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగోయ్ లపై హిమంత రూ. 500 కోట్లకు పరువునష్టం దావా వేశారు. తన పరువుకు భంగం కలిగించేలా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు జితేంద్ర సింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగోయ్ లపై పరువునష్టం దావా వేశానని హిమంత తెలిపారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనపై దురుద్దేశపూర్వకంగా, పరువుకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. వారి నుంచి రూ. 500 కోట్ల నష్ట పరిహారం కోరుతూ పరువునష్టం దావా వేశానని తెలిపారు.

# తమిళ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఆర్కే సెల్వమణి



చెన్నై: తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా సీనియర్ దర్శకుడు ఆర్కే సెల్వమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెల్వమణి... మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా భర్త అనే విషయం తెలిసిందే. సంఘం ఉపాధ్యక్షులుగా కేఎస్ రవికుమార్, పి.వాసు, కార్యదర్శిగా ఆర్వీ ఉదయకుమార్, కోశాధికారిగా పేరరసు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదు జాయింట్ సెక్రటరీ, 17 కార్యవర్గ సభ్యుల పదవులకు ఈనెల 15న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ న్యాయమూర్తి తర్వీశ్ వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల్లో 1,800 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇంతకు ముందు ఆర్కే సెల్వమణి తమిళ దర్శకుల సంఘానికి సెక్రటరీగా పని చేశారు. ఇప్పుడు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# వరుసగా మూడో రోజూ లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో కొన్ని కంపెనీల మూడో త్రైమాసిక (క్యు3) ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 208 పాయింట్లు లాభపడి 84,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67 పాయింట్లు పెరిగి 25,935 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం, ఎన్ఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. ముఖ్యంగా, మైక్రోక్యాప్ కంపెనీల షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది. డిసెంబర్ త్రైమాసికంలో బలమైన ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ ఏకంగా 1 శాతం పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు కొనసాగించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ మీడియా 2.40 శాతంతో అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆటో 1.37 శాతం పెరిగింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే, నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 42.95 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 60,626.40 వద్ద స్థిరపడింది. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 25,550--25,600 స్థాయిల వద్ద ఉంది.

# బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్య

ఢాకా: బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు ఆగడం లేదు. ఇప్పటికే పలువురు హిందువులను బంగ్లాదేశ్ లో దారుణంగా హతమార్చారు. ఈ నెల 12న బంగ్లాదేశ్ లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో... అక్కడ మరో హిందువును హత్య చేశారు. మైమెన్ సింగ్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. సుషేన్ చంద్ర సర్కార్ (62) అనే వ్యాపారిని ఆయన దుకాణంలోనే హత్య చేశారు. మృతుడు త్రిషల్ సబ్ డిస్ట్రిక్ట్ లోని బోగర్ బజార్ లో బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఈయన ఇదే ప్రాంతంలోని సౌత్ కాండ గ్రామంలో నివసిస్తున్నారు. రాత్రి 11 గంటల సమయంలో ఈ హత్య జరిగిందని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారని... ఆ సమయంలో సుషేన్ తన దుకాణంలోనే ఉన్నాడని వెల్లడించారు. హత్య చేసిన తర్వాత హంతకులు షట్టర్ దించి, మృతదేహాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారని తెలిపారు. హంతకుల కోసం గాలిస్తున్నామని చెప్పారు. హత్యను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లవ్లీ చిత్రం







# అమెరికాలో 2000 థియేటర్లలో 'వారణాసి'!

టాలీవుడ్ కి మాత్రమే పరిమితం చేసుకున్న సూపర్ స్టార్ మహేష్ బాబు ఒక్కసారిగా ఇంటర్నేషనల్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇస్తుండడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇక అందుకు తగ్గట్టుగా ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాకి ప్లానింగ్స్ జరుగుతూ ఉండగా ఓవర్సీస్ మార్కెట్ లో ఈ చిత్రానికి ఊహించని ప్లానింగ్స్ జరుగుతున్నట్టు ఇప్పుడు తెలుస్తుంది. ముఖ్యంగా ఒక్క యూఎస్ మార్కెట్ లోనే ఊహించని రీతి రిలీజ్ ని ఈ సినిమాకి ప్లాన్ చేస్తున్నారట. అక్కడ ఏకంగా 2000 కి పైగా థియేటర్స్ లో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నట్టు టాక్. ఇది ఇండియన్ సినిమా నుంచి మాత్రమే కాకుండా నాన్ ఇంగ్లీష్ సినిమాల్లో బిగ్గెస్ట్ రిలీజ్ అన్నట్టు తెలుస్తుంది.

## ఫంకీ మూవీకి యూ/ఏ సర్టిఫికెట్



మాస్ కా దాస్ విశ్వక్ సేన్, 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ఎంటర్టైనర్ 'ఫంకీ' ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చిత్రబృందం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్‌ను పొందింది, అలాగే దీని రన్ టైమ్ 128 నిమిషాలుగా ఖరారు కావడంతో మేకర్స్ దీనిని 'అన్ లిమిటెడ్ అబ్సర్డ్ ఫన్' ప్యాకేజీగా ప్రమోట్ చేస్తున్నారు. ఇండస్ట్రీ నేపథ్యంలో సాగే సెటైరికల్ కామెడీగా తెరకెక్కిన ఈ సినిమాలో విశ్వక్ సేన్ ఒక ఫిల్మ్ డైరెక్టర్‌గా కనిపిస్తుండగా, కాయదు లోహర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'యమ యమ్మ' సాంగ్, ట్రైలర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశాయి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ 4 సినిమాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.



## ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి

సాయి పల్లవి తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. లెజెండరీ సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ లో నటించబోతోంది. భారతీయ శాస్త్రీయ సంగీతానికి వన్నె తెచ్చిన కర్ణాటక సంగత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి. భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సంగీత కారణిగా ఆమె ప్రత్యేకత చాటుకున్నారు. ఆసియా నోబెల్‌గా భావించే రామన్ మెగసేసే పురస్కారాన్ని సైతం సొంతం చేసుకున్నారు. రచయిత, జర్నలిస్ట్, స్వాంతంత్ర్య సమరయోధుడు త్యాగరాజన్ సదాశివంను ప్రేమ వివాహం చేసుకున్నారు. పదేళ్ల ప్రాయంలోనే సంగీతంపై ఆసక్తి పెంచుకున్న సుబ్బులక్ష్మి చదువుని పక్కన పెట్టి సంగీత ప్రపంచానికే పరిమితమయ్యారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ని ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ని మొదలు పెట్టేశారు. మూవీ ఆఫీస్‌ని అల్లు అర్జున్ ఆఫీస్ సమీపంలో తీసుకున్నారట. గౌతమ్ తిన్ననూరి దీనికి దర్శకుడు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వర్క్ ప్రస్తుతం హైదరాబాద్‌లో రాకెట్ స్పీడుతో జరుగుతున్నట్టుగా తెలిసింది.





## 'టాక్సిక్'కు లీగల్ షాక్

కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. బెంగళూరులోని పీణ్య--జలహళ్లి సమీప అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్ సందర్భంగా అనుమతి లేకుండా వేలాది చెట్లను నరికివేశారనే ఆరోపణలు నిజమని కర్ణాటక అటవీ శాఖ తేల్చడంతో నిర్మాతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. షూటింగ్ యూనిట్‌తో పాటు భూమిని లీజుకు ఇచ్చిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేసినట్లు సమాచారం. షూటింగ్‌కు అనుమతి ఉన్నప్పటికీ, అనుమతి పరిమితులను దాటి అడవిలో చెట్లు నరికివేయడం చట్టవిరుద్ధమని అటవీ శాఖ స్పష్టం చేసింది. అటవీ శాఖ మంత్రి స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి ఫొటోలు సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. అనంతరం అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు కావడం ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. ఇది ఒక్కటే కాకుండా, టీజర్ విడుదల సమయంలోనూ 'టాక్సిక్'పై వివాదాలు చెలరేగాయి. టీజర్‌లోని బోల్డ్ సన్నివేశాలు, హింసాత్మక అంశాలపై కొన్ని వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేయగా, మహిళా కమిషన్ వరకూ ఫిర్యాదులు వెళ్లాయి.




## నా లైఫ్‌లో వాలెంటైన్ లేడు: మానస వారణాసి

కపుల్ ఫ్రెండ్లీ ప్రెస్ మీట్‌లో మిస్ ఇండియా మానస వారణాసి తన ప్రేమ ప్రయాణం గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. 'నాకు కాలేజీ రోజుల్లో అస్సలు బాయ్‌ఫ్రెండ్స్ లేరు, అందుకే నా లైఫ్ లో వాలెంటైన్స్ డే సెలబ్రేషన్స్ అనేవే లేవు' అని ఆమె సరదాగా చెబుతూనే అందరినీ ఆశ్చర్యపరిచారు. తనకు సీతారామం లాంటి స్వచ్ఛమైన ప్రేమకథలంటే ఎంతో ఇష్టమని, నిజ జీవితంలో కూడా ఓవర్ థింకింగ్ పక్కన పెట్టి, స్వతంత్రంగా ఉండటానికే తాను ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. సినిమాలో తాను పోషించిన మిత్ర పాత్ర కూడా తన వ్యక్తిత్వానికి చాలా దగ్గరగా ఉంటుందని, అందుకే ఆ క్యారెక్టర్‌తో తాను సులభంగా కనెక్ట్ అయ్యానని ఆమె వివరించారు. టాలీవుడ్‌లోకి సరికొత్త గ్లామర్‌తో పాటు ప్రతిభను కూడా పరిచయం చేస్తున్న నటి మానస వారణాసి. 2020లో మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్న ఈ హైదరాబాద్ సుందరి, మోడలింగ్ రంగంలో తన సత్తా చాటి ఇప్పుడు వెండితెరపైకి అడుగుపెడుతోంది. కేవలం అందం మాత్రమే కాకుండా, సామాజిక అంశాల పట్ల అవగాహన మరియు విశ్లేషణాత్మక ఆలోచనలు కలిగిన వ్యక్తిగా ఆమెకు మంచి పేరుంది.

# హిందూ విలువలతో పెంచుతున్నాం

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా భర్త, అమెరికన్ పాప్ సింగర్ నిక్ జోనస్ భారతీయ సంస్కృతి, హిందూ మతంపై తనకున్న గౌరవాన్ని మరోసారి వెల్లడించాడు. పెళ్లి తర్వాత తన జీవితం ఎలా మారిందో, తన కూతురు మాల్తీ మేరీని ఎలాంటి విలువలతో పెంచుతున్నారో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. ఇటీవల 'సచ్ సంగ్ షో'లో పాల్గొన్న నిక్ జోనస్ మాట్లాడుతూ.. ప్రియాంకను పెళ్లి చేసుకున్న తర్వాత భారతీయ సంప్రదాయాలు, కుటుంబ విలువలు తన జీవితంలో ఎంతో పెద్ద మార్పును తీసుకువచ్చాయని చెప్పాడు. నాకు ఎప్పుడూ పెద్ద ఉమ్మడి కుటుంబం కావాలని కోరిక ఉండేది. ప్రియాంకతో వివాహం తర్వాత అది నిజమైంది. మొదటిసారి ఇండియా వెళ్లినప్పుడు అక్కడి సంస్కృతి, కుటుంబ అనుబంధాలు చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు ఇండియానే నాకు మరో ఇల్లులా అనిపిస్తోంది అని నిక్ పేర్కొన్నాడు. భారతీయ పండుగలపై కూడా నిక్ తన మక్కువను వెల్లడించాడు. ఇప్పుడు నా ఫేవరెట్ పండుగలన్నీ ఇండియన్ ఫెస్టివల్సే. హోలీ, దీపావళి వంటి వేడుకలు నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాలు అని చెప్పాడు. హిందూ మతం గురించి మాట్లాడినప్పుడు నిక్ ఎమోషనల్ అయ్యాడు. హిందూయిజం ఎంతో లోతైనది, అందమైనది. ముఖ్యంగా 'కర్మ' సిద్ధాంతం నాకు బాగా నచ్చింది. మనం చేసే మంచి మనకే తిరిగి వస్తుంది అనే భావన గొప్పది. అలాగే 'ధర్మం' అనే కాన్సెప్ట్ కూడా ఎంతో అర్థవంతమైనది. అందుకే మా కూతురు మాల్తీ మేరీని కూడా హిందూ విలువలతోనే పెంచుతున్నాం. ఆమెకు వాటి అర్థం తెలియజేస్తున్నాం. బహుళ సంస్కృతులు, మతాలు కలిసిన కుటుంబం దొరకడం నా అదృష్టం అని నిక్ వివరించాడు.



## జోర్డాన్‌లో 'డ్రాగన్' యాక్షన్



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్-డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతోంది. అక్కడ ఎన్టీఆర్‌పై అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ ఎపిసోడ్ పూర్తైన వెంటనే ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సాంగ్‌ను కూడా గ్రాండ్ లెవల్‌లో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలిచే అవకాశముంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని యూనిట్ చెబుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా నిలవాలని ప్రశాంత్ నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని సమాచారం. అందుకే స్క్రిప్ట్ దశలోనే ఆయన చాలా సమయం కేటాయించాడట.



# ఓపెనర్లే ముగించేశారు



### కివీస్‌కు రికార్డు విజయం

టీ20 ప్రపంచకప్ టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా ఉన్న న్యూజిలాండ్.. తమ రెండో మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా రెచ్చిపోయింది. పసికూన యూఏఈతో చెన్నైలో జరిగిన గ్రూప్ డీ మ్యాచ్‌లో ఆ జట్టు నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఓపెనర్లే దంచేశారు. విధ్వంసకర ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (42 బంతుల్లో 89 నాటౌట్, 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఫిన్ అలెన్ (50 బంతుల్లో 84 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధ శతకాలతో వీరబాదుడు బాది కివీస్‌కు 10 వికెట్ల భారీ విజయాన్ని అందించారు. ఈ ఇద్దరి విధ్వంసంతో పూర్తి ఏకపక్షంగా మారిన పోరులో లక్ష్యాన్ని కివీస్ 15.2 ఓవర్లలోనే పూర్తిచేసింది. ఆరంభం నుంచే బౌండరీలు, సిక్స్‌లతో మోత మోగించిన ఈ జోడీ పవర్ ప్లేలోనే 78 రన్స్ రాబట్టింది. సీఫర్ట్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకోగా అలెన్‌కు 27 బంతులు అవసరమయ్యాయి. 9 ఓవర్లకే వంద పరుగుల మార్కును దాటిన ఆ ద్వయం.. ఆ తర్వాత అదే ఊపుతో లాంఛనాన్ని పూర్తిచేసింది. యూఏఈ తరఫున కెప్టెన్ మహ్మద్ వసీం (45 బంతుల్లో 66 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), అలిషాన్ షరాపు (47 బంతుల్లో 55, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో ఆ జట్టు మెరుగైన స్కోరు చేయగల్గింది.

## ఇండో-పాక్ మ్యాచ్.. పెరిగిన ఫ్లైట్ చార్జీలు

టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఆ మ్యాచ్‌పై ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే.. కొలంబోకు వెళ్లే విమానాలకు టికెట్ ధరలను అమాంతం పెంచేశారు. ముంబై-కొలంబో మధ్య ఒక్కసారిగా టికెట్ ధరపై పది వేలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన ఆ మ్యాచ్ జరగనున్నది. అయితే తాజా రిపోర్టు ప్రకారం ముంబై-కొలంబో-ముంబై మధ్య విమాన టికెట్ ఛార్జీ 60 వేలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇండోపాక్ సమరానికి తగ్గ రీతిలో విమాన ఛార్జీలు కూడా పెరిగినట్లు కొన్ని రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. ఆన్‌లైన్ బుకింగ్ వివరాల ప్రకారం.. చండీఘడ్ నుంచి కొలంబోకు ఎయిర్ ఇండియా రౌండ్ ట్రిప్ సుమారు 63 వేలు ఉన్నది. ఇక ఇండిగో విమాన ఛార్జీలు సుమారు 70 నుంచి 74 వేలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ-కొలంబో మధ్య ఆ తేదీల్లో విమాన ఛార్జీలు 45 వేలుగా ఉన్నట్లు బుకింగ్ డిటేల్స్ ద్వారా స్పష్టమవుతోంది.





### శ్రీలంక స్పిన్నర్
## హసరంగ ఔట్

టీ20 ప్రపంచకప్‌నకు సహ ఆతిథ్యదేశంగా ఉన్న శ్రీలంకకు టోర్నీ ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ వనిందు హసరంగ తొడ కండరాల గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఆదివారం ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు గాయంతో ఇబ్బందిపడుతూనే బౌలింగ్ చేశాడు. కానీ మ్యాచ్ అనంతరం వైద్య పరీక్షల్లో అతడి గాయం తీవ్రత ఎక్కువుందని తేలడంతో హసరంగ టోర్నీ నుంచి తప్పుకున్నాడు.

## సెమీస్‌కు బెంగాల్
## క్వార్టర్స్‌లో ఆంధ్రా ఓటమి

రంజీ ట్రోఫీలో బెంగాల్ సెమీఫైనల్స్‌కు ప్రవేశించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించిన ఆ జట్టు.. మంగళవారం ముగిసిన మూడో క్వార్టర్స్‌లో ఆంధ్రాపై ఇన్నింగ్స్ 90 పరుగుల తేడాతో నెగ్గింది. తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 629 పరుగుల భారీ స్కోరు సాధించగా ఆంధ్రా.. తొలి ఇన్నింగ్స్‌లో 295, రెండో ఇన్నింగ్స్‌లో 244 రన్స్‌కే కుప్పకూలింది. సెమీస్‌లో బెంగాల్.. జమ్మూకశ్మీర్‌తో తలపడనుంది.

# ఫ్యామిలీకి నో ఎంట్రీ

### గంభీర్, సూర్యకుమార్ విజ్ఞప్తికి బీసీసీఐ తిరస్కరణ

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో ఆటగాళ్లకు బీసీసీఐ పెట్టిన కండిషన్స్‌ను సడలించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ చేసిన విజ్ఞప్తికి బోర్డు నిరాకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మెగా టోర్నీ సందర్భంగా కుటుంబ సభ్యులను తమతో అనుమతించాలని టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చేసిన రిక్వెస్ట్‌ను బీసీసీఐ తిరస్కరించింది. జట్టు ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేసింది. గతేడాది బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాజయం తర్వాత బీసీసీఐ ఆటగాళ్లకు 10 కండిషన్స్‌తో కూడిన గైడ్‌లైన్స్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రధానంగా విదేశీ పర్యటనలు, సిరీస్‌ల సందర్భంగా ఆటగాళ్లతో కుటుంబ సభ్యులు ఉండటాన్ని నిషేధించింది. 45 రోజుల కంటే ఎక్కువ సాగే పర్యటనల్లోనే కుటుంబ సభ్యులను కేవలం 15 రోజులకు మాత్రమే అనుమతించింది.



అయితే ఆటగాళ్లు తమ సొంత ఖర్చుతో కుటుంబ సభ్యుల ప్రయాణానికి, బసకు ఏర్పాట్లు చేసుకోవచ్చు. కానీ ఒకే హోటల్ గదిలో ఉండకూడదు. ఆటగాళ్లందరూ తప్పనిసరిగా టీమ్ బస్సులోనే ప్రయాణించాలి. లోకల్ మ్యాచ్‌లు ఉన్నా కూడా సొంత వాహనాలు వాడకూడదు. ఆటగాళ్ల వ్యక్తిగత మేనేజర్లు, ఏజెంట్లు లేదా ప్రైవేట్ చెఫ్‌లను కూడా టీమ్ హోటల్‌లోకి అనుమతించరు. మ్యాచ్‌ల మధ్య జరిగే అనధికారిక సమావేశాలకు ఆటగాళ్లందరూ తప్పనిసరిగా హాజరు కావాలి అనే నిబంధనలను బీసీసీఐ తీసుకొచ్చింది. ఓ జాతీయ ఛానెల్ రిపోర్ట్ ప్రకారం.. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా మేనేజ్‌మెంట్.. ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ సతీమణులు, కాబోయే భార్యలను ప్రపంచకప్ సమయంలో తమతో ఉండటానికి అనుమతి కోరింది. అయితే ఈ విన్నపాన్ని బీసీసీఐ తిరస్కరించింది. అనధికారిక జట్టు సమావేశాలకు హాజరుకాకుండా కుటుంబ సభ్యులతో సమయం గడపడానికి చాలా మంది ఆటగాళ్లు ప్రాధాన్యం ఇవ్వడంతోనే ఈ నిషేధం విధించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. భారత జట్టు అన్ని స్వదేశీ మ్యాచ్‌లను ముంబై, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, ఢిల్లీలో ఆడుతుంది. పాకిస్థాన్‌తో జరిగే ఏకైక మ్యాచ్ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగనుంది. ఒకవేళ నాకౌట్‌లో దాయాది జట్టుతో మళ్లీ తలపడితే, డిఫెండింగ్ ఛాంపియన్ కొలంబోకు ప్రయాణించాల్సి ఉంటుంది.



# నమీబియాపై నెదర్లాండ్స్ విజయం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ బోణీ కొట్టింది. పాకిస్థాన్‌తో తృటిలో చేజారిన పరాజయం నుంచి త్వరగానే కోలుకుంది. గ్రూప్-ఏలో భాగంగా మంగళవారం ఢిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బాస్ డీ లీడే(72 నాటౌట్, 2/20) ఆల్‌రౌండ్ షోతో నెదర్లాండ్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 156 పరుగులు చేసింది. జాన్ నికోల్ లాఫ్టీ(38 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 42), జాన్ ఫ్రైలింక్(26 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నమీబియా బ్యాటర్లలో నలుగురు మాత్రమే రెండెంకలే స్కోర్ చేయగా.. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డీ లీడే(2/20), లోగన్ వాన్ బ్రీక్(2/13) రెండేసి వికెట్లు తీయగా.. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 159 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. బాస్ డి లీడే(48 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కొలిన్ అకెరమన్(38 బంతుల్లో సిక్స్‌తో 32), మైఖేల్ లెవిట్(15 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 28) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్(9 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 18 నాటౌట్) దూకుడుగా ఆడాడు. నమీబియా బౌలర్లలో బెర్నార్డ్, రుబెన్, జాన్ నికోల్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచింది. తదుపరి మ్యాచ్‌ల్లో ఆ జట్టు అమెరికా, భారత్‌తో ఆడనుంది.



# అభిషేక్‌కు లూజ్ మోషన్స్!

### సంజు శాంసన్‌కు చాన్స్

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో భారత జట్టు పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. ఇండియాను గాయాల బెడద పట్టిపీడిస్తోంది. ఈ టోర్నమెంట్ ప్రారంభమైన నుంచి జ్వరాలు లేదా గాయాలు భారత జట్టును వేధిస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ సందర్భంగా మొదటి మ్యాచ్ కు బుమ్రా దూరమైన సంగతి తెలిసిందే. అతనికి మ్యాచ్ కంటే ముందు వైరల్ ఫీవర్ సోకిందట. ఇక ఇప్పుడు అభిషేక్ శర్మకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జట్టుతో మ్యాచ్ పూర్తయిన తర్వాత అభిషేక్ శర్మకు జ్వరం విపరీతంగా వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఇండియా ఆడబోయే రెండో మ్యాచ్ కు అభిషేక్ శర్మ దూరం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ లో భారత జట్టు తన తర్వాతి మ్యాచ్ నమీబియాతో ఆడనుంది. ఇలాంటి నేపథ్యంలో సంజు శాంసన్ కు బంపర్ ఆఫర్ తగిలినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీనికి కారణం అభిషేక్ శర్మ అనారోగ్యమే. అమెరికాతో మ్యాచ్ పూర్తయిన తర్వాత అభిషేక్ శర్మ చాలా డల్ గా కనిపిస్తున్నాడు. అతనికి వైరల్ ఫీవర్ సోకింది. దానికి తోడు కడుపునొప్పి కూడా వేధిస్తోందట. ఈ తరుణంలో ఇండియా ఆడబోయే రెండవ వరల్డ్ కప్ మ్యాచ్ కు అభిషేక్ శర్మ దూరమవుతాడని అంటున్నారు. ఇదే జరిగితే, ఓపెనర్ అభిషేక్ శర్మ స్థానంలో సంజు శాంసన్ కు ఛాన్స్ వస్తుందని అంటున్నారు. ఇప్పటికే సంజు కు ఓపెనర్ గా చేసిన అనుభవం ఉంది. న్యూజిలాండ్ తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్ లలో విఫలమైనప్పటికీ, సంజు శాంసన్ కు అవకాశం వస్తుందని అంటున్నారు.



## ఆకృతి దహియాకు రజతం


యువ షూటర్ ఆకృతి దహియా, ఒలింపియన్ అంజుమ్ మౌద్గిల్ ఆసియా చాంపియన్‌షిప్ (రైఫిల్/పిస్టోల్)లో పతకాలతో మెరిశారు. ఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో 24 ఏండ్ల ఆకృతి.. 343.8 పాయింట్లు సాధించి రెండో స్థానాన నిలువగా 340.4 పాయింట్లతో అంజుమ్ కాంస్యం గెలిచింది. కజకిస్థాన్ షూటర్ సొఫియా షుజెంకొ (358.2) అగ్రస్థానంతో ప్రపంచ రికార్డు సృష్టించడమే గాక స్వర్ణాన్ని దక్కించుకుంది.



## స్విమ్మింగ్‌లో తల్లీకొడుకు రికార్డు

హైదరాబాద్‌లోని బర్కత్‌పురకు చెందిన అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా, ఆమె కుమారుడు స్టీఫెన్ కుమార్ స్విమ్మింగ్‌లో మరో కొత్త రికార్డు సృష్టించారు. న్యూజిలాండ్‌లోని కుక్ స్ట్రీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కడి కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 6.23 గంటలకు నిర్వహించిన స్విమ్మింగ్‌లో తల్లీ కొడుకులు పోటీపడ్డారు. ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ 27.4 కిలోమీటర్ల దూరాన్ని 8.57 గంటల్లో ఈది దక్షిణ భారత్‌లో మొదటి మహిళా స్విమ్మర్‌గా రికార్డు నెలకొల్పారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 11-2-2026



# ఏపీకి వరాలు.. టీజీకి కష్టాలు

కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ మనుగడకు అత్యంత కీలకమైన తెలుగుదేశం పార్టీ మద్దతు ఉండటంతో, చంద్రబాబు అడిగినవన్నీ కేంద్రం మంజూరు చేస్తోంది. నూతన రాజధాని నిర్మాణానికి ప్రత్యేక ఆర్థిక సాయం కింద ఏకంగా రూ.15,000 కోట్లను కేంద్రం కేటాయించింది. ఏపీ జీవనాడి అయిన పోలవరాన్ని సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం పూర్తి స్థాయిలో నిధులను భరిస్తామని హామీ ఇచ్చింది. ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.10,134 కోట్ల నిధులు లభించాయి. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి విభజన చట్టం ప్రకారం కేంద్రం ప్రత్యేక గ్రాంట్లు ప్రకటించింది. మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ, కేంద్ర బడ్జెట్ నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదు. తెలంగాణకు రైల్వే రంగంలో రూ.5,454 కోట్లు మాత్రమే కేటాయించారు, ఇది ఏపీకి దక్కిన నిధులతో పోలిస్తే దాదాపు సగం మాత్రమే. హైదరాబాద్ మెట్రో రెండో దశ, మూసీ ప్రక్షాళన, గిరిజన విశ్వవిద్యాలయం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. తెలంగాణ నుంచి ఏకంగా 8 మంది బీజేపీ ఎంపీలు, మరో 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నా, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో వారు విఫలమవుతున్నారనేది సత్యం. అధికారంలో ఉన్న బీజేపీ ఎంపీలు కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారన్నది, విపక్ష కాంగ్రెస్ ఎంపీలు కేవలం నిరసనలకే పరిమితమవుతున్నారన్నది నిజం. మొత్తానికి, కేంద్రంలోని సంకీర్ణ రాజకీయాల సమీకరణాలు ఆంధ్రప్రదేశ్‌కు కలిసి వస్తుంటే, తెలంగాణ మాత్రం రాజకీయ ప్రాధాన్యం లేక నిధుల కొరతతో సతమతమవుతోంది.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం

# దొంగలకు సద్ది కట్టకండి

ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికల హడావుడి నడుస్తోంది. ఇది చిన్న ఎన్నిక కాదు సోదరా. మీ ఇంటి ముందు తాగునీరు వస్తుందా? డ్రైనేజీ పొంగుతుందా? కుళాయిలు పనిచేస్తాయా? వీధి దీపాలు వెలుగుతాయా? రోడ్లు బాగుంటాయా? పార్కులు, మురుగు కాలువలు, మౌలిక వసతులు మెరుగుపడతాయా? అన్నదంతా ఈ ఓటుతోనే తేలుతుంది. అందుకే ఈసారి ఓటు వేయడమంటే కేవలం గుర్తు నొక్కడం కాదు... భవిష్యత్తును నిర్ణయించడం. ఇప్పుడు ఓటు అడుగుతూ చాలా మంది నాయకులు దండాలు పెడతారు, చేతులు జోడిస్తారు. 'ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు..వెంటనే పని' అంటారు.

కానీ ఓటర్లారా.. నిజంగా వాళ్లకు స్పందించే గుణం ఉందా? ఇన్నాళ్లు అధికారంలో ఉన్నప్పుడు మీ ఫోన్ ఎత్తారా? మీ వీధిలో సమస్య వస్తే వచ్చారా? లేదా ఎలక్షన్ టైమ్ లోనే మీ ఇంటి మెట్లు ఎక్కారా? ఇదే కాదు... ఇంకో ముఖ్యమైన విషయం కూడా బేరీజ్ చేయాలి. ఆ అభ్యర్థి భూ కబ్జాదారా? ఆక్రమార్కుడా? ప్రభుత్వ భూములు, లేఅవుట్లు, ఓపెన్ ప్లాట్లు, పార్కులు, చెరువులు కబ్జా చేసిన బ్యాక్‌గ్రౌండ్ ఉందా? అలాంటి వాళ్లే కౌన్సిలర్, కార్పొరేటర్ అయితే.. రేపు మీ ఊరి భూమి, మీ వీధి, మీ పిల్లల భవిష్యత్తు ఎవరి చేతుల్లో ఉంటది? ఇంకా చూడాల్సింది చాలానే ఉంది. రౌడీ ఇజం చేస్తాడా? బెదిరింపుల రాజకీయాలా? నేర ప్రవృత్తి ఉందా? అవినీతి కేసులు, దందాలు, అక్రమ సంపాదన ఆరోపణలు ఉన్నాయా? లేదా నిజంగా ప్రజలను కలుపుకొని పోయే మనసున్న మనిషా? ఇవి అన్నీ చూసి ఓటు వేయాలి. లేకపోతే మళ్లీ మోసపోవడం ఖాయం. సూటిగా చెప్పాలి అంటే.. భూ కబ్జాదారులకు సద్ది కట్టకండి. ఆక్రమాలు చేసి కోట్లు సంపాదించిన వాళ్లకు మళ్లీ ఓటు వేసి దండాలు పెట్టకండి. అవినీతిని వృత్తిగా మార్చుకున్న వాళ్లకు ఈసారి ఓటుతోనే బుద్ధి చెప్పాలి. గతంలో రాష్ట్రవ్యాప్తంగా చాలా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో ఏమి జరిగిందో ప్రజలందరికీ తెలుసు. ముఖ్యంగా జగిత్యాల వంటి పట్టణాల్లో కొత్త ఇల్లు కట్టుకుంటే.. "పర్మిషన్ కావాలా? డబ్బులు పెట్టాలి" లక్ష.. రెండు లక్షలు.. మూడు లక్షలు కూడా. డబ్బులు ఇస్తే ఫైల్ కదులుతుంది. లేకపోతే నిబంధనల పేరుతో అడ్డంకులు, ఆక్రమణ నిర్మాణమని బెదిరింపులు. ఇది ఒక్క జగిత్యాల కథ కాదు. ఇది రాష్ట్రవ్యాప్తంగా చాలా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో జరిగిన దుర్వినియోగం. అందుకే ఈ కథనం తెలంగాణ అంతటా ప్రతి ఓటరికి వర్తిస్తుంది. ఇలాంటి వాళ్లను మళ్లీ గెలిపిస్తే, వాళ్ల చేతుల్లో మళ్లీ మన జేబు పెట్టినట్టే. రేపు మరింతగా దోచుకుంటారు. అప్పుడు "నాయకులు మారరు" అని బాధపడినా ఉపయోగం ఉండదు. ఇప్పుడు వాళ్లే మళ్లీ వస్తారు. డబ్బు



పంచుతారు, మద్యం ఇస్తారు, హామీ లు గుప్పిస్తారు, "ఈసారి నిజంగా పని చేస్తా" అంటారు. ఓటర్లారా... ఒక్కసారి మీ మనసులో ప్రశ్న వేసుకోండి. ఇన్నాళ్లు అధికారంలో ఉన్నప్పుడు తాగునీటి సమస్య తీర్చారా? డ్రైనేజీ బాగు చేసారా? వీధి దీపాలు వెలిగించారా? రోడ్లు వేసారా? లేదా మీ దగ్గర డబ్బులు తీసుకున్నారా? డబ్బు ఇచ్చి ఓటు కొనే వాడు, గెలిచాక వంద రెట్లు వసూలు చేస్తాడు. ఇది మన తెలంగాణ అనుభవమే. అందుకే ఈసారి ఒకే మాట.. భూ కబ్జాదారులకు ఓటేయకండి. ఆక్రమార్కులను తిరస్కరించండి. అవినీతిపరులను బయటకు నెట్టండి. పార్టీ చూసి కాదు... మనిషిని చూసి ఓటేయండి. ప్రజలకు అందుబాటులో ఉంటాడా? ఫోన్ చేస్తే స్పందిస్తాడా? అహంకారం లేకుండా మాట్లాడతాడా? అక్రమాలకు ఎదురెళ్లే ధైర్యం ఉందా? ప్రజలను కలుపుకునే తత్వం ఉందా? మంచి కౌన్సిలర్, మంచి కార్పొరేటర్ అంటే.. మీ ఇంటి ముందు కనిపించాలి, సమస్య వింటే తప్పించుకోకూడదు, పర్మిషన్ కోసం డబ్బులు అడగకూడదు, రౌడీ ఇజం కాకుండా సేవా భావం ఉండాలి. ఇది ఒక్క ఓటు కాదు సోదరా... ఇది రాష్ట్రవ్యాప్తంగా అవినీతి నాయకులకు బుద్ధి చెప్పే అవకాశం. చివరిగా ఓటర్లారా దొంగలకు సద్ది కట్టకండి. మీ ఓటు అమ్మకండి. మీ పిల్లల భవిష్య త్తును తాకట్టు పెట్టకండి. ఈసారి నిజ మైన ప్రజాసేవకుడినే గెలిపించండి. అప్పుడే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రజల వవుతాయి. దోపిడీదారులవి కావు.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

# భూమి కొంటున్నారా..!

ప్రతి వ్యక్తికి తన జీవితంలో తన స్వంత ఇల్లు అనేది ఒక కల. ఆ కలను నెరవేర్చుకోవడానికి ఒక్కొక్కరి విషయంలో జీవితాంతం కష్టపడాల్సి వస్తుంది. అలా ఎంతో కష్టపడి పైస పైసా కూడబెట్టి జమ చేసుకున్న డబ్బుతో ఒక స్థలం కొందాము అనుకుంటే ఆ స్థలం ఎంతవరకు సరైనదో తెలుసుకోవడం ఒక పెద్ద పరీక్షలాంటిది. సరైన అవగాహన లేకుండా, ఏమి చేయాలో తెలియక, కొందరైతే కేవలం రియల్ ఎస్టేట్ బ్రోకర్లను నమ్మి తమ కష్టార్జితం అయిన సొమ్మును గుడ్డిగా పెట్టుబడి పెట్టి మోసపోతున్నారు. అలా మోసపోకుండా ముందు జాగ్రత్తగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేయుట ఈ వ్యాసము ముఖ్య ఉద్దేశం.



ఒక ఓపెన్ ప్లాట్ లేదా అపార్ట్మెంట్ ఫ్లాట్ తీసుకోవాలి అనుకున్నప్పుడు సామాన్యంగా రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ద్వారానే వెళ్ళవలసి వస్తుంది. కొన్ని సందర్భాలలో నేరుగా ప్రాపర్టీ ఓనర్‌నే కలువవచ్చు. ఎలాంటి సందర్భమయినా మనం ముందుగా అడుగవలసింది ఆ ప్రాపర్టీ ప్లాట్ నంబరు, సర్వే నెంబరు, అట్టి సర్వే నెంబరు ఉన్నటువంటి గ్రామం పేరు, మండలము, జిల్లా తెలుసుకోవాలి. ఎందువలనంటే హైదరాబాదు లాంటి మహా నగరంలో తాము ఉంటున్న పరిసరం గ్రామము, మండలము చాలా మందికి తెలియదు. ఈ వివరాలు అనగా గ్రామం, మండలం, జిల్లా వివరాలు అట్టి ప్రాపర్టీ విక్రయ దస్తావేజు యందు వివరముగా నమోదు చేయబడి ఉంటాయి. ఇట్టి వివరముల ద్వారా సంబంధిత ఎమ్మార్వో కార్యాలయములో తగిన ఫీజును చెల్లించి 'పహణి' లేదా 'అడంగల్' పత్రాలను పొంది అట్టి భూమి స్వభావము తెలుసుకోవచ్చు. అనగా అట్టి భూమి స్వభావము సర్కారు భూమి, యినామ్భూమి, గైరాన్ భూమి, గ్రామ కంఠం లేదా వ్యవసాయ భూమి అయి ఉండవచ్చు. ఒకవేళ సర్కారు లేదా యినామ్ లేదా గైరాన్ లేదా గ్రామ కంఠం భూములైతే అలాంటి భూములను కొనకూడదు.

ఓపెన్ ప్లాట్ లేదా అపార్ట్మెంట్ ఫ్లాట్ కొంటున్నప్పుడు విక్రయదారుడు సాధారణంగా విక్రయ దస్తావేజులను ముందుగా విక్రయ విలువలో 10% నుంచి 25% అడ్వాన్సు ఇచ్చిన తర్వాతే ఇస్తూ ఉంటారు. అలా ఎన్నటికి అడ్వాన్సు చెల్లించ కూడదు. నామమాత్రపు టోకెన్ అడ్వాన్సు రూ.10,000/- నుంచి రూ.50,000/- వరకు చెల్లించవచ్చు. ఇట్టి చెల్లింపునకు రశీదు తీసుకోవలెను. ఒకవేళ కొంటున్న ప్రాపర్టీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అట్టి టోకెన్ అడ్వాన్సు రుసుము వాపసు చెల్లించే కండిషన్ రశీదు నందు వ్రాయించుకోవాలి, కనీసం 7 రోజుల వ్యవధి తీసుకోవాలి. ఈ ఏడు రోజులలో అట్టి కొనదల్చుకొన్నప్రాపర్టీ కొనుటకు వీలయిన ప్రాథమిక సమాచార పరీక్ష జరిపించుకోవాలి. అనగా ఈసీ పరీక్షించుకోవడం, ప్రాపర్టీ ఏదైనా ప్రొహిబిషన్ జాబితాలో ఉన్నదా అని పరీక్షించుకోవడం, ఏదైనా చెరువులు, కుంటలలో ఉన్నదా అని పరీక్షించుకోవడం అనగా హైడ్రా లాంటి వాటికి సంబంధించిన ఎఫ్టీఎల్ లేదా బఫర్ జోన్ వంటి వాటి పరీక్షలు జరిపించుకోవాలి. ఇట్టి పరీక్షలు తగిన అనుభవము ఉన్నవారు లేదా ఎవరైనా అడ్వకేట్ ద్వారా చేయించడం మంచిది. ఇలాంటి ప్రాథమిక పరీక్షలఅనంతరం ఒకవేళ ప్రాపర్టీ సరియైనదనిప్రాథమిక నిర్ధారణకు వచ్చిన తర్వాత అడ్వాన్సు రుసుము చెల్లిస్తే మంచిది. అడ్వాన్సు రుసుమును చెల్లించే సందర్భములో తగిన అనుభవము ఉన్న అడ్వకేట్ ద్వారా అమ్మకపు ఒప్పంద పత్రమును తగిన సాక్షుల సమక్షములో వ్రాయించుకోవడము మంచిది. అమ్మకపు ఒప్పంద పత్రము తేదీ నుంచి కొనుగోలు తేదీ వరకు కనీసము 45 రోజుల వ్యవధి ఉంచడం ఎంతో అవసరం. ఇప్పుడు ప్రాపర్టీ టైటిల్ డాక్యుమెంట్, లింకు పత్రాలు, లేఔట్ పత్రాలు, విక్రయదారుని ద్వారా తీసుకుని, ఎమ్మార్వో ఆఫీసు ద్వారా సంపాదించిన 'పహణి' లేదా 'అడంగల్' పత్రాలతోపాటుగా అడ్వకేట్‌కు యిచ్చి, అడ్వకేట్ ద్వారా సంపూర్ణ పరీక్ష జరిపించి,'కొనవచ్చు' అనే హామీ అడ్వకేట్ ద్వారా పొంది, ప్రోపర్టీని కొనుట ఎంతో ఉత్తమం. ఒకవేళ అడ్వొకేట్ పరీక్షలో ప్రాపర్టీ కొనుటకు ఏదైనా వ్యతిరేకత వచ్చినపుడు విక్రయదారునకు అడ్వాన్సుగా ఇచ్చినటువంటి సొమ్మును వాపసు పొందడము చాలా కష్టము అవుతుంది. సాధారణముగా విక్రయదారులు అడ్వాన్సు మొత్తమును తిరిగి ఇచ్చుటకు ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తుంటారు. అడ్వాన్సు నుంచి కొంత శాతము కోత కోస్తూ ఉంటారు. తమ ప్రాపర్టీ యందు ఎలాంటి ఇబ్బందులు లేవని వితండ వాదన చేస్తూ ఉంటారు. అడ్వాన్సు సొమ్మును తిరిగి ఇవ్వడం నుంచి తప్పించుకోవడానికి దారులు వెతుకుతుంటారు. అందువలన అలాంటి సమస్యల నుంచి బయట పడాలి అంటే, మన సొమ్ము మనకు తిరిగి పొందాలి అంటే తగిన జాగ్రత్తలతో, తగిన అనుభవం ఉన్న అడ్వకేట్ ద్వారా సాక్షుల సమక్షంలో విక్రయ ఒప్పంద పత్రమును తయారు చేయించడం చాలా మంచిది. ఇలాంటి తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రాపర్టీ కొనుగోలు చేయుట ద్వారా కొనుగోలుదారు తాను ఎంతో కష్టపడి సంపాదించి పెట్టుకునే పెట్టుబడికి భద్రత పొందగలుగుతాడు.



ఏజే కరణ్‌లాల్, అడ్వొకేట్
9492557496
advocateajkl@gmail.com

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.